ప్రజాశక్తి ఆదివారం అనుబంధం

మే 14, 2006

మొబైల్... మొబైల్...

హ్యాపీ బర్త్‌డే

(14.5.2006 నుండి 20.5.2006 వరకు)

అబ్దుల్ కబీర్
5సం॥ మే-16, 2001
షేక్ ఖాదర్, అక్తరున్నీసా
యనమలకుదురు, విజయవాడ

జె. యాపిల్
2సం॥, మే-18
జగతభాను - కృష్ణ
భద్రాచలం-ఖమ్మంజిల్లా.

పొన్నెకంటి అరవింద్ కుమార్
మే-18,
ఉషారాణి- యాదగిరి
ఏదులాపురం-ఖమ్మంజిల్లా

గిప్టి
జయ- చంద్రం
చిన్నకోదూర్-మెదక్ జిల్లా

యడవల్లి మౌనిక
మే-18
దుర్గ-మాధవరావు
నూజివీడు-కృష్ణాజిల్లా

కె. మోహన్ సాయి
1సం॥, మే-2
మోహనలక్ష్మి - సుబ్రమణ్యం
హైదరాబాద్

శ్రీనందన్
1సం॥, మే-15
జ్యోతి - హనుమంతరావు
వల్లాపురం-ఖమ్మంజిల్లా



కామినేని మోహన్ కుమార్
1సం॥, మే-18
జయంతి- అశోక్‌కుమార్
పూనూరు-ప్రకాశంజిల్లా.

ఎం.శ్రీజ
3సం॥, మే-18
వై.వరలక్ష్మి - ఎం.మహేందర్
హైదరాబాద్



మన అతిథి గురించి...

పేరు	:	దువ్వూరు భాస్కర్‌రెడ్డి
పుట్టిన తేది	:	10.11.1924
వృత్తి	:	ఛైర్మన్, రీసెర్చ్ అండ్ ఎక్స్‌పరిమెంటల్ మెడిసిన్, ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంట్రాలజీ,
నచ్చిన వ్యక్తులు	:	ఉపాధ్యాయులు
నచ్చిన అంశం	:	పిల్లలు వృద్ధిలోకి రావడం
నచ్చని అంశం	:	అబద్ధాలు ఆడడం
బలం	:	ఆత్మవిశ్వాసం
బలహీనత	:	అందరినీ నమ్మడం
మరచిపోలేని సంఘటనలు	:	డైరెక్టొరేట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు డైరెక్టర్ అయినపుడు మా అమ్మగారి ముఖంలో కనిపించిన ఆనందం. నా దగ్గర చదివిన విద్యార్థుల్లో ఆరుగురు (సోమరాజు, ప్రసాదరావు, జిఎన్. రావు, నాగేశ్వర్‌రెడ్డి, నరేంద్రనాథ్, హబీబుల్లా) పద్మశ్రీ అవార్డును అందుకోవడం
అలవాట్లు	:	పుస్తకపఠనం, అందరినీ నవ్వించడం.
ఆశయం	:	ప్రజలకు సేవ చేయడం.
ఆదర్శం	:	నా భార్య

అంకితభావం తగ్గింది...

దాదాపు అందరిలో క్రమశిక్షణ, అంకితభావం తగ్గాయి. ఫ్యామిలిటీ కూడా తగ్గుతోంది. ఉన్నత స్థానాల్లో చేరేకొద్దీ తమవారిని మర్చిపోతున్నారు. నేటి యువత భిన్నమైన ఆలోచనలతో ఉన్నారు. ఉన్నత విద్యకు, నైపుణ్యాన్ని పెంచుకోవడానికి వాళ్ళు విదేశాలకు వెళ్తున్నారు. ఇది తప్పు కాదు. కానీ తిరిగి మన దేశానికి వచ్చి సేవచేయాలి. డాక్టర్లు గ్రామాల్లోని ప్రాథమిక వైద్య కేంద్రాలకు వెళ్లడంలేదని అనడం సరికాదు. అక్కడ వారికి అన్ని వసతులూ కల్పిస్తే సేవ చేయడానికి సిద్ధమవుతారు. డిగ్రీలు, పీజీలు పూర్తయ్యాక యువత ఉద్యోగాలకోసం ఎదురు చూస్తోంది. ఉద్యోగం కల్పించని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తంచేస్తోంది. యువత స్వయంకృషిపై ఆధారపడడం నేర్చుకోవాలి. అందుకుతగ్గ కోర్సులను యూనివర్సిటీలు ప్రవేశపెట్టాలి. కులతత్వం, మతతత్వం పోవాలంటే కులాంతర, మతాంతర వివాహాలను ప్రోత్సహించాలి.

D Bhaskara Reddy

ఈ సంచికలో...

టపా ... 2
టర్నింగ్‌పాయింట్ ... 4
సలహాలు ... 5
ఇంటి సంగతులు ... 6
క్యాంపస్ ఛాట్ ... 10
సినిమా కబుర్లు ... 11
బాలనేస్తాలు ... 12
అట్టమీది కథ ... 14
సెన్సూ కామన్ సెన్సు ... 20

ఇంకా...

ఇలా వుందామా... 7

ప్రసూనాలు

కథ 18
ఉల్లి సేయును మేలు



సీరియల్ 8
తెలుగుగడ్డ

ఆరోగ్యం ... 17
ఓ మంచి పుస్తకం ... 21
మనసా... తెలుసా ... 22
విజ్ఞాన వీచిక ... 23
కొత్త పుస్తకాలు ... 24



ఫాల్కే కథనం బాగుంది

ఇప్పటి వరకు మాకు దాదాఫాల్కే అవార్డు గురించే తెలుసు. కానీ 'అట్టమీది కథ' ద్వారా ఫాల్కే ఎవరో? ఆయన గొప్పతనమేమిటో తెలిసింది. ఆయన సినీ పరిశ్రమకు చేసిన సేవ గురించి రచయిత చక్కగా వివరించారు. 'అవీ-ఇవీ', కార్టూన్స్, జోక్స్ మమ్మల్ని బాగా ఆకట్టుకుంటున్నాయి. శ్రీరామదాసు చిత్రకథలో చరిత్ర వక్రీకరణను గురించి బాగా చెప్పారు.

రవి,షరీఫ్,
రాజాం, శ్రీకాకుళం.



నిజం

ఈ వారం అతిథిగా డాక్టర్ బాలాంబగారిని పరిచయం చేశారు. నైతిక విలువలనేవి యూనిర్సల్ కావని చక్కగా చెప్పారావిడ. పైగా ముందు మనం ఆచరించి చూపాలన్నారు. ఇదెంతో నిజం. మనం చేయకుండా ఇంకొకరికి చెప్తే, వాళ్ళు మాత్రం ఎందుకు ఆచరిస్తారు?! అందరూ ఇలా ఆలోచిస్తే బాగుండును.

టి. పాండురంగారావు, మంగళగిరి.

అవసరం

దాదా సాహెబ్ ఫాల్కేపై వచ్చిన ముఖచిత్రకథనం చాలా బాగుంది. ఆయన జీవితంలోని ముఖ్యమైన సంఘటనలన్నిట్నీ క్రోడీకరించి సంక్షిప్తంగా రాయడం ప్రశంసనీయం. సందర్భం కలిసొచ్చినపుడు ఇలాంటి మహనీయులను స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా వుంది.

ఎస్. పావని, కంకిపాడు.

చిన్నతప్పు-పెద్దతంటా

అవగాహనాలేమితోనో, సరదాపడో - తెలిసో, తెలియకో చేసే చిన్నతప్పువల్ల చాలాపెద్దతంటాలే వస్తాయని 'దిద్దుకోలేని తప్పు' కథలో చాలా చక్కగా చెప్పారు. తరువాత పశ్చాత్తాపుడి తప్పును దిద్దుకోవాలన్నా ఆ అవకాశం ఉండదని చెప్పడంవల్ల పనిపై శ్రద్ధ పెంచేలా కథ తోడ్పడింది. ఎవరో ఒకరు చేసిన తప్పుకు మొత్తం సంస్థకే చెడ్డపేరు ఎలా కలిగిందో చక్కగా చెప్పారు. నీటివ్యాపారంపై జ్యోతిష్యం చెప్పే కార్టూన్ నీటి సమస్యను తెలిపేలా వుంది.

ఆర్. జానకి, ఏలూరు.

బాగున్నాయి...

'దిద్దుకోలేని తప్పు' కథ ద్వారా మీడియా చేస్తున్న ఆర్భాటాలను, తప్పులను గురించి రచయిత నేర్పుగా వ్యక్తంచేశారు. వార్తలను ప్రజలకు చేరవేయడంలో యాజమాన్యాల, పత్రికోద్యోగుల అలక్ష్యాన్ని కళ్లకు కట్టినట్లు చెప్పారు. లాయర్ సలహా మా స్నేహితుని కుటుంబానికి ఎంతగానో ఉపయోగ పడిందన్న విషయం తెలియజేయడానికి సంతోష పడుతున్నాను. టర్నింగ్ పాయింట్ ద్వారా రాణీ చెన్నమ్మ పరాక్రమాన్ని, ఆంగ్లేయుల ఆధిపత్యాన్ని అడ్డుకున్న తీరును తెలుసుకున్నాం.

కె. నాగరాజు,
గరివిడి, విజయనగరం.

ఆసక్తిరేకెత్తిస్తున్నాయి

ఏప్రిల్30న స్నేహాలో అచ్చయిన 'శ్రీరామదాసు-రాజకీయాలు' (సినీసమీక్ష)లో బిజెపి మతరాజకీయాలపై జ్వాలాముఖిగారు సంధించిన విమర్శనాస్త్రం నన్ను బాగా ఆకట్టుకుంది. శ్రీరామదాసు సినిమాలో కబీర్ వ్యక్తిత్వాన్ని మార్చి చూపించి ఎలా చరిత్రను వక్రీకరించారో విశదీకరించిన తీరు బాగుంది. కథకు రెండు పేజీలు కేటాయించడం వల్ల మరింత ఆసక్తిగా ఉంది. 'చిరంజీవ.. చిరంజీవ'లో అవయవదానం మరో మనిషికి ఏవిధంగా సహాయపడుతుందో చక్కగా వివరించారు.

శ్రీధర్, కరీంనగర్.

ఆహ్లాదపరిచే క్యాంపస్

'క్యాంపస్‌ఛాట్'లో సెలవుల్లోనూ విద్యార్థులు ఎంట్రన్స్ పరీక్షల కోసం పడే శ్రమను వివరంగా తెలిపారు. ఇంట్లో అందరూ సరదాగా ఎంజాయ్ చేస్తుంటే వీళ్లు మాత్రం పుస్తకాలకే అంకితమవ్వాల్సి వస్తోందన్న చెప్పిన తీరు బాగుంది. సినిమాకెళ్ళాలనే ఆలోచనొచ్చినా పరీక్ష గుర్తొచ్చి మళ్లీ పుస్తకాల్లోకి తలదూర్చుతున్నారని చెప్పడం వాస్తవానికి దగ్గరగా ఉంది. కానీ కథనంలో అమ్మాయిల అభిప్రాయాలు చొప్పించి అబ్బాయిల బొమ్మలెయ్యడం నప్పలేదు. సినిమా కబుర్లలో కాంతారావుగారి ఇంటర్వ్యూ బాగుంది. టర్నింగ్‌పాయింట్ ద్వారా యువతలో మంచి ప్రేరణ కలిగిస్తున్నారు.

వీరభద్రం, సత్యనారాయణ గాజువాక, విశాఖ.

మేకప్

స్నేహ పత్రిక మేకప్ బాగుంటోంది. ఇకపై కూడా ఇలాంటి శ్రద్ధే తీసుకుంటారని ఆశిస్తాం.

మొహమ్మద్ ఇక్బాల్, మహబూబ్ నగర్.

బాగున్నాయి

సినీ నటుడు కాంతారావు గారి కబుర్లు బాగున్నాయి. ఆనాటి విశేషాలు తెలిశాయి.

ఎన్. హరి, ఉయ్యూరు.

రూ.510/-ల ఇంగ్లీష్ కోర్సు రూ.150/-కే

లేటెస్ట్ టెక్నాలజీ సహాయంతో



మొత్తం మూడు డివిజన్ల ప్రత్యేక ఇంగ్లీష్ కోర్స్

డివిజన్-1	డివిజన్-2	డివిజన్-3	
రూ.130/-	రూ.170/-	రూ.210/-	రూ.510/-

రూ.150/-కే

ఇవన్నీ!

డివిజన్-1 ABCD ల నుంచి ఇంగ్లీష్ చదవటం, రాయటం, నేర్పుతూ, ప్రతి ఒక్కరికీ కావలసిన స్థాయిలో స్టాండర్డ్ ఇంగ్లీష్ నేర్పబడుతుంది. ఈ కోర్స్ ఫీజు రూ.130/-

డివిజన్-2 తప్పులు లేకుండా ఇంగ్లీషు రాయుటకు కావలసిన ఆంగ్ల వ్యాకరణం పరిపూర్ణంగా సులభ సూత్రాలతో చాలా ఈజీగా నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.170/-

డివిజన్-3 ఎంతో సులభంగా, ఏ సందర్భంలోనైనా తడబడకుండా, తప్పులు లేకుండా, మంచి నీళ్ళు తాగుతున్నట్లుగా మంచి ఇంగ్లీషు మాట్లాడటం నేర్పబడుతుంది. ఈ కోర్సు ఫీజు రూ.210/-

ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!...

నేను ఒకసారి రైలులో ప్రయాణిస్తున్నాను. నా ప్రక్క సీటులోని వ్యక్తి స్టూడెంట్స్ ఇంగ్లీష్ ఇన్‌స్టిట్యూట్ వారి పుస్తకాలు చదువుతున్నాడు. నేనూ టైంపాస్ కొరకు ఒక బుక్ తీసుకొని చదివాను. అంతే! నాకు ఆశ్చర్యంవేసింది. "ఇంగ్లీష్ నేర్చుకోవడం ఇంత ఈజీనా!..." అనిపించింది. నేనూ పుస్తకాలు తెప్పించుకుని చదివి ప్రస్తుతం నేను చక్కగా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్నాను.

- కె.కమలాకరరావు, విజయవాడ.

ఇదొక డిఫరెంట్ కోర్స్!

డిగ్రీవరకు చదివిన నేను ఇంగ్లీష్‌లో మాట్లాడలేకపోయేవాడిని, నా మిత్రుని వద్ద ఈకోర్స్ బుక్స్ చూశాను. ఇంగ్లీష్ ఫ్లూయెన్సీకి కరక్ట్‌గా ఉపయోగపడే బుక్స్ యివి. 'ఇదొక డిఫరెంట్ కోర్స్' అని నాకు అనిపించింది.

- వి.కె. రాజు, రాజమండ్రి.

కోర్స్ అద్భుతంగా ఉంది!

అవును! ఈ ఇంగ్లీష్ కోర్స్ చాలా అద్భుతంగావుంది. ఎందుకంటే, బాగా చదివినవారికే కాక, కొద్దిగా చదువుకున్న వారికి కూడా అర్థమయ్యేరీతిలో చెప్పిన విధానం చాలా బాగుంది.

-కె.సురేష్, హైదరాబాద్.

ఎక్కడా చూడలేదు

నేను డిగ్రీ వరకూ చదివాను. అయినా ఇంగ్లీష్ మాట్లాడలేక పోయేవాడిని. సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోండి అని ప్రకటన చూసి కోర్స్ కొన్నాను. నిజానికి నేను ఇలాంటి కోర్స్ బుక్స్ ఎక్కడా చూడలేదు.

- వై.చంద్రశేఖర్, విశాఖపట్నం.

సులభంగా వుంది

చాలా పుస్తకాలు చూశాను. ఇంగ్లీష్ నేర్పే విధానం ఆ పుస్తకాల్లో అర్థమయ్యేది కాదు నాకు. ఈ కోర్స్ కొని చదువుతుంటే, ఇంగ్లీష్ ఇంత సులభమా అనిపించేంతగా వుంది. చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకొన్నాను.

- జె.శ్రీనివాసులు, తిరుపతి.

STUDENTS' ENGLISH INSTITUTE

POST BAG NO.8569, New No. 203, Habibullah Road, (Near: KodambakkamRly. Stn;) T.Nagar, Chennai - 17.

నాకు ప్రస్తుతం రూ.510/-లు విలువగలిగిన ఇంగ్లీష్ కోర్సు కేవలం రూ.150/-లకే వి.పి.పి. ద్వారా పంపించండి. పోస్ట్‌మేన్‌కి పైకం చెల్లించి ప్యాకెట్‌ని తీసుకుంటానని హామీ ఇస్తున్నాను.

3727

Name: ....

Address: ....

....

....

....

.... Pincode

టర్నింగ్ పాయింట్

వకుళాభరణం రామకృష్ణ

గుమస్తాగిరి నుండి ప్రపంచ గణితశాస్త్రవేత్తగా...



మనుషుల్లో ప్రతిభ నివురుగప్పిన నిప్పులా దాగి ఉంటుంది. దాన్ని గుర్తించి వెలికి తీసినప్పుడే రాణింపు లభిస్తుంది. గుర్తింపులేని ప్రతిభ నిరర్థకమౌతుంది. మట్టిలో దాగివున్న ఇలాంటి ఒక మాణిక్యాన్ని గూర్చిన వివరాల్లోకెళితే...

తమిళనాడులోని కుంభకోణం ప్రాంతంలో ఒక నిరుపేదకుటుంబంలో 1887, డిసెంబరు 22న శ్రీనివాసరామానుజం జన్మించాడు. తండ్రి శ్రీనివాస అయ్యంగార్. బట్టల దుకాణంలో గుమస్తా. తల్లి కోమలతమ్మాళ్. వంటలక్కగా పనిచేస్తూ, కొద్దిగా సంపాదించేది. చిన్నతనం నుంచీ రామానుజం క్లాసులో లెక్కలు అతిలాఘవంగా చేస్తుండేవాడు. ఏకాంతంగా ఆలోచిస్తూ ఉన్నప్పుడు టీచర్ ప్రశ్నిస్తే, నక్షత్రాల మధ్య దూరాల్ని, వాటి పరిమాణాల్ని లెక్కిస్తున్నానని చెప్పేవాడు. దీంతో ఉపాధ్యాయులు అబ్బురపడేవారు. ఇలా ఉండగా రామానుజం జీవితంలో మొదటి మలుపు 16 ఏళ్ల వయసు(1903)లో తిరిగింది. లండన్ విశ్వవిద్యాలయంలో ట్యూటర్‌గా పనిచేస్తున్న 'కార్' రచించిన "ద సినాప్సిస్ ఆఫ్ ఎలిమెంటరీ రిజల్ట్స్ ఇన్ ప్యూర్ అండ్ అప్లైడ్ మేథమెటిక్స్" అనే గ్రంథాన్ని చదివాడు. ఈ గ్రంథం రామానుజంలోని అసాధారణ ప్రతిభను తట్టి లేపింది. ఈ గ్రంథంలో 6165 సిద్ధాంతాలున్నాయి. గ్రంథకర్త వాటిలో వేటికీ నిరూపణలుగానీ, వివరణలుగానీ ఇవ్వలేదు. కాని, అది చదివిన రామానుజం అందులోని సిద్ధాంతాలకు వివరణలు, ఉపపత్తులు రాయకుండా, చివరి ఫలితాలను మాత్రమే తన నోట్‌బుక్కులో రాసుకున్నాడు. 'కార్' గ్రంథంలోని ప్రతి సూత్రాన్నీ, సిద్ధాంతాన్నీ స్వయంగా శోధించి సమాధానాలు కనుక్కున్నాడు. దీంతో రామానుజం అసమాన ప్రతిభ వెల్లడైంది.

మెట్రిక్ పాసయ్యాక ఎఫ్.ఎ(ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్)లో చేరాడు. కాని ఒక్క గణితంలో మినహా మిగతా పాఠ్యాంశాలన్నింటిలోనూ తప్పాడు. అనంతరం 22 సంవత్సరాల వయసులో రామానుజానికి 9 ఏళ్ల జానకితో వివాహమైంది. ఆమె కాపురానికి రావడానికి కొంతకాలం పట్టింది. ఉద్యోగం లేదు. దారిద్ర్యం అతన్ని వెంటాడసాగింది. దీంతో రామానుజం మద్రాసు చేరాడు. కలవని వ్యక్తి లేదు. తొక్కని గడప లేదు. మద్రాసులోని అనేక గణితోపాధ్యాయులకు తన నోట్సులు చూపించాడు. ఎవరికీ అందులోని లెక్కలు అంతుచిక్కలేదు. ఇంతలో పచ్చయప్ప కళాశాలలో ఆచార్యులుగా పనిచేస్తున్న సింగారవేలుతో రామానుజానికి పరిచయమేర్పడింది. తన నోట్సులను కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి పంపించమని ఆయన సలహా ఇచ్చారు. కాని ఎలా పంపాలో రామానుజానికి అర్థంకాలేదు. ఇంతలో రామానుజానికి మద్రాసు పోర్టు ట్రస్టులో చిన్న గుమస్తా ఉద్యోగం వచ్చింది. అప్పుడు 1913లో కేంబ్రిడ్జిలోని గణిత శాస్త్రాచార్యుడు హార్డ్‌కు ఒక జాబు రాసి, దాంతోబాటు తాను పరిష్కరించిన గణిత సమస్యల నోట్సులను జతపర్చి పంపాడు. వాటిని చూసిన హార్డ్ నిశ్చేష్టుడయ్యాడు. రామానుజంలో నిద్రాణమైయున్న గణితశాస్త్ర పాండిత్యానికి అచ్చెరువొందాడు. వెంటనే ఉపకార వేతనంతోపాటు కేంబ్రిడ్జి ట్రినిటీ కళాశాలలో ఉండేందుకు అన్ని వసతులూ కల్పించాడు. ఇది రామానుజం జీవితంలో అత్యంత ముఖ్యమైన మలుపు.

కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయానికి వెళ్లాక, రామానుజం కృషికి హార్డ్ మెరుగులు దిద్ది ప్రపంచానికి చాటాడు. రామానుజం పరిశోధనలకు కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం బి.ఎ పట్టానిచ్చింది. భారతదేశంలో ఎఫ్.ఎ పాస్ కాలేనివ్యక్తి ఏకంగా కేంబ్రిడ్జిలోనే బి.ఎ పట్టా పొందాడు. అంతేకాదు, 1918లో రాయల్ సొసైటీ ఆఫ్ ఇంగ్లాండ్‌లో రామానుజానికి 'ఫెలో ఆఫ్ రాయల్ సొసైటీ' బిరుదునిచ్చింది. ఇది అత్యంత అరుదైన సత్కారం. ప్రపంచంలో ఏ కొద్దిమంది మహనీయులకో కానీ ఇది లభించదు. అదే సంవత్సరం కేంబ్రిడ్జి ట్రినిటీ కళాశాలలో సంవత్సరానికి 250 పౌన్ల వేతనంతో 'ఫెలో'గా ఎంపికయ్యాడు.

ఇంగ్లండులో ఇన్ని సత్కారాలు, గుర్తింపులు పొందుతున్నా రామానుజం సంతోషంగా లేడు. ఏకాంతవాసం, కుటుంబానికి సుదూరంగా వుండటంవల్ల ఇంటిమీద బెంగ, శాకాహారులకు సరిపడని ఆహారం వంటి సమస్యలతన్ని చుట్టుముట్టాయి. దీంతోబాటు అప్పట్లో భయంకర వ్యాధిగా పరిగణించే క్షయవ్యాధికీ గురయ్యాడు. 1918లో స్వదేశానికి తిరిగొచ్చాడు. 1920, ఏప్రిల్ 26న అంటే 32ఏళ్ల వయసులోనే అకాల మరణానికి గురయ్యాడు.

రామానుజం మరణాన్ని గురించి మాట్లాడుతూ హార్డ్ మహాశయుడు 'నేనొక అమూల్య రత్నాన్ని కోల్పోయాను' అన్నాడు. ప్రఖ్యాత శాస్త్రవేత్త జూలియస్ హక్స్‌తో, రామానుజాన్ని 'ఈ శతాబ్దపు గొప్ప గణిత శాస్త్రజ్ఞుడు'గా అభివర్ణించాడు. ప్రాచీన భారతీయ గణిత శాస్త్రజ్ఞులు ఆర్యభట్టు, బ్రహ్మగుప్తుడు, భాస్కరుడు - మొదలైనవారి సరసన చేరదగ్గ సిసలైన జాతిరత్నం శ్రీనివాసరామానుజం. ఫలస పాలనాకాలంలో దారిద్ర్యానికి, నిరాదరణకు, నిర్లక్ష్యానికి బలైపోయాడు.

*

జి.ఎల్.నరసింహారావు
హైకోర్టు న్యాయవాది

లైసెన్సు తిరిగివ్వలేదు...

ఒక లైసెన్సును రెన్యూవల్‌కోసం ఆఫీసుకు పంపాం. దానికి సంబంధించిన చెక్కు సకాలంలోనే పంపినప్పటికీ, ఏ కారణమూ చూపకనే ఇంతవరకు లైసెన్సు తిరిగివ్వలేదు. చట్టరీత్యా మేం దీనిపై ఎలాంటి చర్య తీసుకోడానికి అవకాశం ఉంది?

ఎస్.ఎ. కరీమ్, తెనాలి.

మీరు ఎటువంటి లైసెన్సు అనేది చెబితే బాగుండేది. అంటే ఎక్సైజ్‌లైసెన్సా, డ్రైవింగ్ లెసెన్సా, కాంట్రాక్టు లైసెన్సా అనేది ఆ అక్ట్ ప్రకారం మీరు తగిన విధంగా జత చేసి అన్ని నిబంధనలూ పూర్తి చేసి ఉంటే వెళ్ళి అడగండి, లేదా లాయర్ నోటీస్ ఇచ్చి చూడండి. అప్పటికీ స్పందన లేకుంటే వారిపై అధికారుల్ని సంప్రదించండి. అయినప్పటికీ మీ పని కానట్లయితే చట్టప్రకారం ప్రొసీడ్ కావలసి ఉంటుంది.

లాయర్‌ను పెట్టుకోవాలా ?

నేను ఒక పత్రికలో ఇచ్చిన క్లాసిఫైడ్స్ చదివాను. అందులో మీ ఇంటి వద్దనే వుండి నెలకు 30,000 పైన సంపాదించవచ్చునని ప్రకటన ఇచ్చారు. ఎలా అని ఆ అడ్రసుకు నేను లెటర్ రాశాను. వారు నాకు కాల్ లెటర్ పంపించారు. 550 రూపాయలు డిడి కట్టించి రిజిష్టర్ పోస్టు చేయమన్నారు. నేను అలానే చేశాను. వారు పంపిన కాల్ లెటర్‌లో 10 రోజుల్లో మీకు సమాచారం అందుతుందని రాశారు. కానీ నెల దాటినా నాకు ఎలాంటి సమాచారం అందలేదు. నేను కోర్టుకు వెళదామనుకుంటున్నాను. కోర్టుకు వెళ్ళటానికి ఏదైనా మార్గముంటే చెప్పండి. నేను లాయర్‌ను పెట్టుకోవాలా? లాయర్‌ను పెట్టుకుంటే ఎంత ఖర్చు అవుతుంది? ఇలాంటి మోసగాళ్లను శిక్షించాలి. సరైన వివరాలు తెలపగలరు.

సేనాపతి వెంకటరావు, వి.మాడుగుల, విశాఖపట్నం జిల్లా.

మీరు పంపినట్లుగా అతనికి ఇంకెంతమంది పంపించి ఉంటారో ఊహించండి. అలా డబ్బులన్నీ సేకరించి ఈ పాటికే ఉడాయించి ఉంటాడు. మీరు సదరు సంస్థ ఉన్నదో లేదో ప్రత్యక్షంగా వెళ్ళి తెలుసుకోండి. వారు చెప్పే మాటలు, సంప్రదింపుల ద్వారా వారు నమ్మకస్తులు అవునా కాదా సరి చూసుకోవాలి.

కానట్లయితే ఆ ప్రాంతంలోని పోలీస్‌స్టేషన్లో కేసు పెట్టండి. ఇది చీటింగ్ క్రిందికి వస్తుంది కనుక పోలీసు కేసుకు డబ్బులు అవసరం ఉండదు.



ఇంటి సంగతులు

కె.రంజన

"అమ్మా! నాకు బోర్‌గా వుంది!!"

"సెలవుల్లోకూడా నన్ను నా ఇష్టమొచ్చినట్టు చెయ్యనివ్వరేంటి? అంత పెందలాడే నిద్ర లేపుతారెందుకు?"

"అమ్మా! నాకు ఆకలిగావుంది. ఏదైనా కొత్తది తినాలని వుంది"

"నాకు ఇప్పుడు స్నానం చెయ్యాలని లేదు...లేదు. నేను ఇంకా చాలాసేపు ఆడుకుంటానంతే"

"నేను కంప్యూటర్ గేమ్స్ ఆడుకుంటూనే టీవీలో టామ్ అండ్ జెర్రీ చూస్తా. టీవీ ఆపేస్తే అస్సలు ఒప్పుకోనంటే ఒప్పుకోను"

"అవే ఆటలు ఆడుకునీ ఆడుకునీ బోర్ కొట్టేసిందమ్మా! పైగా మా నేస్తాలు కొంతమంది ఊరికి వెళ్లిపోయారు. ఇద్దరు ముగ్గురితో ఏం ఆటలు ఆడుకోమంటావ్?"

★★★

ఇలాంటి మాటలు ప్రతి ఇంట్లోనూ వినిపిస్తుంటాయి. మరి వేసవి సెలవులుకదా. పిల్లలు ఇలాగే మాట్లాడతారు. తల్లిదండ్రులకేమో వారిని ఎలా సంభాళించాలో ఒకపట్టాన అర్థంకాదు. ఎందుకంటే పిల్లలు ఎప్పుడూ ఏదో ఒకటి విభిన్నంగా చేయాలని చూస్తారు. ఎప్పుడూ చెయ్యనిది చెయ్యాలనుకుంటారు. పైగా ఎండలు కావడంతో ఎక్కువ సమయం ఇంట్లోనే గడుపుతారు. దాంతో వారికి అనివార్యంగా బోర్ కొడుతుంది. ఇక ఉన్నంతలో వారికి టీవీ చూడడమే హాయిగా వుంటుంది. అలా ఒదిలేస్తే ఇరవైనాలుగుగంటలూ కార్టూన్ చానళ్లకే అతుక్కుపోతారు. ఒకవేళ అక్కడినుంచి లేస్తే మాత్రం ఏమీ తోచక ఒక గదిలోంచి మరో గదిలోకి తిరుగుతుంటారు. ఏదైనా తినాలనిపిస్తుందంటారు. దాంతో పెద్దలకు వీరిని ఒకచోట కూర్చోబెట్టడమే ఒక పెద్ద యజ్ఞంగా తయారౌతుంది.

మరి ఏం చేయాలి?

పిల్లల నోటి వెంట బోర్ అనే రెండక్షరాల మాట రాకుండా వుండాలంటే... వారికి ఒక చక్కటి అలవాటు చెయ్యాలి. అది పెద్దలకు ముందు కాస్త కష్టంగానే వుంటుంది. అయినా దానివల్ల భవిష్యత్తులో మంచి ప్రయోజనం కలుగుతుంది.

పుస్తకాలు చదివించాలి

ఇంతకీ ఆ మంచి అలవాటు ఏంటంటే... పిల్లలు పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి. ఎందుకంటే చిన్నారులకు పుస్తకాలు చదివే అలవాటు చెయ్యాల్సిన సరైన సమయం ఇదే కాబట్టి.

ఎవరికి ఎలాంటి పుస్తకాలు!

పిల్లలకు మూడేళ్ల వయసునుంచే పుస్తకాలను పరిచయం చేయాలి. నాలుగేళ్ల పిల్లలకు పెంపుడు జంతువులు, బొమ్మలతో పరిచయం అవుతుంది. అప్పుడే వారు మెల్లగా ఊహించడం మొదలెడతారు. అప్పుడు వారికి ఏది తప్పో, ఏది రైటో తెలిపే పుస్తకాలను ఇవ్వాలి. ఐదారేళ్ల పిల్లలకు ఫాంటసీ కథల పుస్తకాలు ఇవ్వాలి. ఇవి వారిలోని భయాలను, కోపాన్ని పోగొట్టడానికి ఉపక రిస్తాయి.

ఏడేళ్ల పిల్లలకు దినపత్రికలు, మ్యాగజైన్లు, చారిత్రక, పౌరాణిక కథానాయకుల పుస్తకాలు, కామిక్ పుస్తకాలు ఇవ్వాలి. ఇవి తమ చుట్టూ వున్న ప్రపంచం గురించి వారిలో ఒకవిధమైన చైతన్యాన్ని కలిగిస్తాయి.

ఎనిమిదేళ్లు పైబడిన పిల్లలకు ప్రశ్నించేధోరణి అధికంగా వుంటుంది. అందుకే వారికి ఎందుకు? ఎలా? ఎక్కడ? వంటి ప్రశ్నలకు సమాధాన మిచ్చేటటువంటి జనరల్‌నాలెడ్జి పుస్తకాలను అందించాలి.

ఎలా చదివించాలి?

ఇలా...విషయం ఏదైనా పెద్ద పెద్ద బొమ్మలున్న రంగురంగుల కథల పుస్తకాలు కొనిస్తే వారు ఎంత ఆసక్తిగా చదువుతారో తర్వాత మీరే గమనిస్తారు.

ముందు బొమ్మలకు ఆకర్షితులై పేజీలన్నీ ఎంతో ఇష్టంగా తిరగేసి చూస్తారు. తర్వాత అసలు ఆ బొమ్మ సందర్భం ఏంటో తెలుసుకోవాలన్న జిజ్ఞాస పుడుతుంది వారిలో. పక్కనే వున్న పెద్దవాళ్లను అడుగుతారుకూడా. అక్కడే పెద్దలు కాస్త తెలివిగా వ్యవహరించాలి. సుతిమెత్తగా వారినే చదువుకోమని చెప్పాలి.

మరీ చిన్న పిల్లలైతే చదివేటప్పుడు సాయం చెయ్యండి. వారితో కూర్చుని చదివించండి. లేదా మీరే చదవండి. కొన్ని రోజులు పోతే మీరు లేకుండానే పిల్లలు పుస్తకాలు పట్టుకుని కూర్చుంటారు.

ముందు కొన్ని రోజులు కథను పెద్దగా చదివించండి. మీరు కూడా గట్టిగా చదివితే వారికి అదే అలవాటవుతుంది. కొత్త పదాల ఉచ్చారణ తెలుస్తుంది.

చదివిన తర్వాత ఆ కథలను వారికి అర్థమయ్యేలా రెండుసార్లు చెప్పండి. పూర్తిగా అర్థమైన తర్వాత చివరికి పిల్లల చేత ఒకసారి చదివించండి.

ఈ పద్ధతి వేసవి సెలవులతోనే మూలన పడిపోకూడదు. సెలవుల తర్వాత కూడా ప్రతినెలా వారికి ఒక మంచి పుస్తకం కొనిస్తే మంచిది. పిల్లలకు కథల పుస్తకాలను ఇష్టంగా చదివే అలవాటు వుంటే... తరగతి పుస్తకాలను కూడా ప్రేమగా చదువుతారు మరి.

*

బోర్ కొడుతుందంటున్నారా!

అయితే... కథలు చదివిద్దాం!!



ఇలా వుందామా...

వి. నాగరత్న



"మా మనవడికి డొనేషన్ ఏభైవేలట, నెలవారీ ఫీజు నాలుగొందలు, మూణ్ణెల్లకోసారి టర్మ్ ఫీజని ఇంకేవేవో వుంటాయట. ఇక పుస్తకాలుంటాయో బస్తాడు. ఒక్కోటీ ఖరీదైన ఆల్బమ్‌లా మెరిసిపోతూ అందుకు తగ్గట్లే బోలెడు రేటు. మొత్తానికి మావాడు కొడుకు చదువుకోసం వెనకాముందూ చూడకుండా ఖర్చుపెడుతున్నాడు..." అంటూ మురిపెంగా చెప్తోంది సుభద్రమ్మ ఊర్నుండొచ్చిన బంధువులావిడతో.

⁂

పిల్లల కోరిక మేరకు ఆ ఆదివారంపూట ఓషన్‌పార్కుకు తీసికెళ్ళారు తల్లిదండ్రులు. అక్కడ తరుణ్, తనూజలు ఆడింది ఆట, పాడింది పాట. అంతా కలిసి తెగ ఎంజాయ్ చేశారు. టికెట్లు, ట్రాన్స్‌పోర్టు, తిండీతిప్పలు అంతా కలిపి పదిహేనొందలు ఇట్టే ఖర్చయింది. భార్య లెక్కలేసి ఆ మాట అన్నపుడు "అయితే అయిందిలెద్దూ, పిల్లలకోసం కాకపోతే సంపాదించడం ఎందుకట?" అనేశాడు భర్త కూతుర్ని ప్రేమగా హత్తుకుంటూ.

⁂

హడావిడిలో కూతురు టిఫిన్‌బాక్స్ మర్చిపోయి ఆటో ఎక్కేసింది. అది గమనించిన తల్లి ఎండలోపడి స్కూలుకెళ్ళి బాక్స్ ఇస్తూ "పిచ్చిమొద్దూ, నేను చూడబట్టి సరిపోయింది. బాక్సును గమనించకుండా ఆఫీసుకు వెళ్ళిపోతే ఏంచేసేదానివి?" అంది. "నువ్వు మరీనమ్మా, ఒక్కరోజు లంచ్ లేకపోతే ఏమౌతుందట? ఇంత కష్టపడి తీసుకురావాలా ఏంటి?" అంటూ అందుకుంది కూతురు. "ఇక్కడ నువ్వు ఆకలితో నకనకలాడుతుంటే నేనెట్లా నిశ్చింతగా వుండగలను" అని ఆప్యాయంగా తలపై నిమిరి వెనుతిరిగింది తల్లి.

⁂

హేమంత్ ఆటల్లో పడిపోయినందున మోకాలికి దెబ్బ తగిలి రక్తం కారుతోంది. తల్లి డెటాల్‌తో తుడిచి కాటన్‌తో కట్టుకట్టి, టి.టి. ఇంజక్షన్ చేయించింది. నొప్పి అంటూ కొడుకు ఏడుస్తోంటే అక్కున చేర్చుకుని ఓదార్స్తోంది. వాడి దుఃఖం చూస్తే ఆవిడ మనసు మనసులో లేదు. అది చూసిన భర్త "పిల్లలన్నాక దెబ్బలు తగలవా ఏంటి, నువ్వలా బెంబేలుపడ్తావేంటి?" అని నవ్వుతోంటే "వీడు బాధపడ్తే నేను చూడలేను" అని ముద్దులు కురిపించింది కొడుక్కి.

⁂

ఆ ప్రేమాభిమానాలు, ముద్దుముచ్చట్లు సవ్యమైన కుటుంబము, అమ్మానాన్నలున్న పిల్లల సంగతి. వాళ్ళకి బాల్యం బంగారమే. కానీ తల్లిదండ్రుల్లేక, వున్నా వాళ్ళని పట్టించుకునే అవకాశంలేని చిన్నారులూ వున్నారు. వాళ్ళనే స్ట్రీట్ చిల్డ్రన్ లేదా వీధిబాలలు అంటున్నాం.

ప్రసూనాలు

'ఎవరికి పుట్టిన బిడ్డ, వెక్కెక్కి ఏడ్చింది?' చందంగా అనాథ ప్రసూనాలు ఏ ముద్దుమురిపాలకూ నోచుకోకపోగా కనీస అవసరాలు కూడా తీరక అల్లాడుతున్నారు. హాయిగా ఆడుతూపాడుతూ చదువుకోవాల్సిన వయసులో రెక్కలు ముక్కలుచేసుకుని జానెడుపొట్ట నింపుకుంటున్నారు. మంటలు మండించే ఎండకాలంలో చక్కగా సేదతీరడానికి బదులు చేతనైన పనిచేస్తూ తిరుగుతున్నారు. శీతాకాలం వెచ్చటి రగ్గు కప్పుకుని తల్లిపక్కన పవళించడానికి బదులు గడ్డకట్టించే చలిలో పేవ్‌మెంట్లపై పడుకుంటున్నారు. వానాకాలం వర్షపునీళ్ళను చూస్తూ కేరింతలు కొడ్తూ కాగితపు పడవలతో ఆడుకునేంత అదృష్టం వాళ్ళకెక్కడిది? ఏ రైల్వే ప్లాట్‌ఫామ్‌మీదో తడవకుండా తలదాచుకుందామని ఆశపడి వెళ్తే పోలీసులు నాలుగు తగలనిచ్చి గెంటేస్తే మరో షెల్టర్ వెతుక్కుంటూ పరిగెట్టేపనిలో పడ్తారు. బలపం పట్టాల్సిన చేత్తో గునపం, పాలు తాగాల్సిన చేత్తో ఎంగిలి కప్పులు కడగటం... ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో.

ఇలాంటి బాలకార్మికులు లేదా అనాథ బాలల్ని చూస్తే నిజంగా కడుపు తరుక్కుపోతుంది. ఊహ తెలియని పసివయసులోనే బండెడుబరువును నెత్తికెత్తుకోవలసిరావడం కంటే విషాదం ఇంకేమైనా వుందా? పువ్వులు మంటల్లోపడి మాడిపోతున్నట్లుగా వుంటుంది. అమ్మానాన్నల ఆలంబనతో, కొండంత అనురాగంతో పెరిగిపెద్దవ్వాల్సిన పాపలు, బాబులు దిక్కూమొక్కూలేకుండా అల్లాడే దైన్యస్థితి ఎంత దారుణం?! ఆ చిన్నారుల పరిస్థితిలో మన పిల్లల్ని క్షణమాత్రం ఊహించి భరించగలమా? అలాంటి ఊహే తట్టుకోలేమంటే అదెంత దుర్భరస్థితో ఇట్టే అర్థమౌతుంది.

అసలిందరు అనాథపిల్లలు ఎందుకు తయారౌతున్నారు? ఉడతాభక్తిగానైనా మనమేమీ చేయలేమా? ఎందరికో విరాళాలిచ్చే సంస్థలు, స్వచ్ఛంద సహాయకేంద్రాలు శిశువిహార్ లాంటి శరణాలయాలను మరింత పరిపుష్టం చేయలేవా? ప్రభుత్వం ఈ విషయంలో ఎంతవరకూ పట్టించుకుంటోంది? ఇలాగే నిర్లక్ష్యం చేస్తే ఈ మొగ్గలు వసివాడిపోతాయి. లేదంటే మంచి రంగూ, పరిమళం నశించి వాసనలేని పూవులౌతాయి. ఈ నిస్సహాయ చిన్నారులకోసం మనమేమీ చేయలేమా? మనకున్నదాంట్లో ఓ గుప్పెడు వాళ్ళకోసం కేటాయించగల్గినా సరిపోదూ?! ఇకపైనైనా ఇలా చేద్దామా?!! ✱

సీరియల్

గొల్లపూడి నారాయణరావు

(పటేలు అకారణంగా ఏసురత్నాన్ని బాగా కొట్టాడు. పటేలంటే వున్న భయంవల్ల ఇతర్లేమీ మాట్లాడలేదుగానీ యాదవరెడ్డి మాత్రం కలిగించుకుని ఆయన చేసింది సమర్థనీయం కాదని ధైర్యంగా చెప్పాడు)

తెలుగుగడ్డ

17 వ భాగం

పట్వారి నవ్వి "టౌను కావలి పక్కగ్రామాల్లో చూడు. చిన్నపిల్లవాణ్ని కదిలించే వీల్లేదు. ఆ గ్రామాల్లో పటేలు పట్వారీలంటే ఏమాత్రమూ విలువలేదనుకో" అన్నాడు.

"ఆ గ్రామాల సంగతి మనకెందుకు? మనపాట్లు మనం పడాలికాని"

"ఏం చేద్దామంటావు?"

"ఏదయినా ప్రతీకారం ఉంటే ఆలోచించండి. గ్రామమంతా మరీ బరితెగించిపోయింది. అన్నివిధాలా మన పరువు మర్యాదలు నీళ్లుకారిపోతున్నాయి"

"ప్రతీకారమంటూ మన అధికారాన్ని వినియోగపెట్టే రోజులు కావయ్యా"

"అంటే"

"ఏ రోటివద్ద పాట ఆ రోటివద్దనే పాడవలసిన రోజులు. భారీ సాయుధసైన్యమున్న సర్కారీయే ఇప్పుడు అస్తుబిస్తుగా ఉంది. అలాంటప్పుడు గ్రామరైతులందరితోనూ మనకు కక్షలెందుకు?"

"మీవన్నీ పిరికి సలహాలు"

పట్వారి నవ్వి "పటేలూ, నువ్వు బాగా ఆలోచించు. మన ఇష్టం వచ్చినట్లు నడవడానికి వెనుకటిరోజులుకావు. గ్రామ రైతులకు సంగం బలముంది. సంగం అంటే సర్కారీయే అదిరి చస్తోంది గదా?" అన్నాడు.

"సంగంవాళ్లకూ, గ్రామరైతులకూ లొంగి ఉండమనా మీరు చెప్పేది?"

"లొంగి ఉండమని అన్నానా. అందరితో మంచిగా ఉంటే సరిపోదూ?''

"చాల్లెండి. సర్కారీ ఉప్పు, పులుసు తింటూ సంగంవాళ్లను వూనుకుని తిరగమంటారేమిటి? ఆ విధంగా చేయడం సర్కారీకి ద్రోహంగాదూ?"

"ఇందులో ద్రోహప్రసక్తే లేదయ్యా. మన మానాన మనం ఉండడం అవుతుంది"

"ఇలాంటి సలహాలు చెప్తారని కాదు నేనొచ్చింది"

"ఎలాంటి సలహాలు కావాలి?" నవ్వుతూ అడిగాడు పట్వారి.

"ఈ గ్రామం వాళ్లందరినీ రకరకాల చిత్రహింసలపాలు చేయాలి"

"పటేలూ, కాలానుగుణ్యంగా మారాలి మనం. కాలానికి ఎదురు తిరిగి బతకలేం. బాగా ఆలోచించు"

"మీ నీతులు నాకక్కర్లేదులెండి. వెళ్తున్నా" అంటూ లేచి నిల్చున్నాడు పటేలు.

"కూర్చోవయ్యా? ఇప్పుడే వెళ్తున్నావేమిటి?"

"ఎందుకూ కూర్చోవడం, మీ ఉద్దేశం తెలిసిపోయింది. ఇక వెళ్తా" అంటూ పటేలు అక్కడినుండి వెళ్లిపోయాడు.

భవాని వెలుపలికొచ్చి "ఏవండీ, పటేలు కోపమొచ్చి వెళ్తున్నాడా?" అనడిగింది.

"అవును. నిష్ఠూరంగా మాట్లాడి వెళ్లిపోయాడు"

"వెళ్తే వెళ్లనీయండి మనకేమిటి? మొదటినుంచి ఆయన మాటలన్నీ వింటూనే ఉన్నాను. మీరు బాగానే మాట్లాడారులెండి"

"లేకపోతే గ్రామం వాళ్లందరితోనూ తగాదా తెచ్చుకుంటామా ఏమిటి"

"కాదండిమరీ, నయాన భయాన వాళ్లవల్లేగదా మనం బతికేది"

"కాకపోతే సర్కారువారిచ్చే మూడుదమ్మిడీల జీతానికి బతుకుతున్నామా?" అన్నాడాయన.

తర్వాత ఆమె సంభాషణ మార్చేసింది. "పన్నెండు కావస్తోంది. మడికట్టుకుని భోజనానికి రండి" అంది.

పట్వారి కుర్చీలోంచి లేచాడు. చొక్కా గుండీలు తీసుకుంటూ లోపలికి నడిచాడు.

* * *

తెలుగుగడ్డ గ్రామంలోకల్లా సుబ్రహ్మణ్యశాస్త్రి ఒట్టి చాదస్తపు మనిషి. కానీ గొప్ప సిద్ధాంతి. ఆ గ్రామంలోవారు ఏరువాక సాగాలన్నా, విత్తులు ఎదపెట్టాలన్నా, కనీసం పొరుగూరు ప్రయాణం చేయాలన్నా ఆయన్నడిగి మంచిరోజు తెలుసుకుని పోతుంటారు. ఆయన పెట్టిన ముహూర్తం ఆ గ్రామంవారికి గురి.

మధ్యాహ్నం కావస్తోంది. సుబ్రహ్మణ్యాశాస్త్రి అప్పుడే భోంచేసి వచ్చి వరండాలో చిరుచాపపై బాసిపట్టు పెట్టికూర్చున్నాడు. కళ్లు మూసుకుని కృష్ణనామం జపిస్తున్నాడు. ఆ సమయంలోనే కోదండరాంరెడ్డి, పెద్దిరెడ్డి వగైరా రైతులందరూ అక్కడికొచ్చారు.

"అయ్యగారూ" అని పిల్చాడు కోదండరాంరెడ్డి.

"శాస్త్రి ఉలికిపాటుతో కళ్లుతెరచి చూశాడు. గ్రామ రైతులందరూ ఎదురుగా నిలబడి ఉండడం చూసి ముందు కొద్దిగా కంగారుపడ్డాడు. తర్వాత కాసేపటికి, "అందరూ ఒక్కసారిగా వచ్చారేమిటయ్యా?" అనడిగాడు.

"పనిమీద వచ్చాం లెండి" అన్నాడు కోదండరాంరెడ్డి.

"మరి నిలబడే ఉన్నారేం? రండి కూర్చోండి" అన్నాడు సుబ్రహ్మణ్యశాస్త్రి. అందరూ వరండాలో ఒక పక్కగా కూర్చున్నారు.

"రాత్రి తోకచుక్క కనిపించిందండీ" అన్నాడు కోదండరాంరెడ్డి.

"అయ్యో నాలుగు రోజులనుండి వరుసగా కనిపిస్తూంది కాదయ్యా" అన్నాడు సుబ్రహ్మణ్యశాస్త్రి.

"అట్లాగా? మేం రాత్రే చూశాంలెండి" అన్నాడు కోదండరాంరెడ్డి.

"అసలు రాత్రే మీవద్దకు రావాలనుకున్నాం. కానీ అంత నిద్రపొద్దువేళ మిమ్మల్ని లేపడమెందుకులెమ్మని మానుకున్నాం" అన్నాడు తిరిగి.

"నా దగ్గరికొస్తే నేను మాత్రం ఏం చేయగలను? దేశానికి మహా విపత్తు రానున్నదని తెలుస్తోంది" అన్నాడు సుబ్రహ్మణ్యశాస్త్రి.

రైతులందరూ తలూపారు.

"దీనికి ఉపశాంతులేమీ లేవటయ్యా?" అడిగాడు కోదండరాంరెడ్డి.

"ఉపశాంతులెందుకు లేవు నాయనా, ఆ ఉపశాంతి కొరకే ఈ నాలుగు దినాలనుండి కృష్ణపరమాత్మను ఏకదీక్షగా ధ్యానిస్తున్నాను"

"మరి మమ్మల్నందరినీ ఏం చేయాలని శలవిస్తారు?" అడిగాడు కోదండరాంరెడ్డి.

"అందరూ కృష్ణపరమాత్మనే ధ్యానించండి, ఆ బృందావన విహారికి భజనలు సలపండి. రానున్న ముప్పు తప్పుతుంది" అన్నాడు సుబ్రహ్మణ్యశాస్త్రి.

అందరూ తలలూపారు.

కోదండరాంరెడ్డి పెద్దిరెడ్డివైపుకు చూస్తూ "పెద్దయ్యా మీ యాదవ భజన నేర్చుకున్నవాడే గదా, కుర్రవాళ్లందరినీ పిల్చుకుని దేవుడి గుడివద్ద భజన ప్రారంభించమని చెప్పు" అన్నాడు.

"ఏమో బావయ్యా వాడిప్పుడు నా మాటల్లో ఉన్నాడా? ఆ పత్రికలు చదవడం, అందరికీ సంగం మాటలు చెప్పడం.. అంతేకాని మరింకే ప్రపంచమూ వాడికి కాబట్టలేదు" అన్నాడు పెద్దిరెడ్డి.

కోదండరాంరెడ్డి నవ్వి "ఈ సంవత్సరం పెళ్ళి చేసినట్టయితే ఆ పిచ్చంతా ఉండేది కాదు. ఒక గుదిబండ మెడకుబడితే ఎటూ కదలలేకపోను" అన్నాడు.

"నిజమే, కాని ఆ కల్యాణం నెట్టుకరావద్దూ?"

"నెట్టుకొచ్చేది ఏమిటయ్యా? పిల్లకోసం తింగ్గవలసిన పనిలేకుండా మేనరికం ఊళ్లోనే ఉంది కదా? పాపం బ్రహ్మారెడ్డి మీ యాదవకే తన కూతురునివ్వాలని నిరుటినుండి కాచుక్కూర్చున్నాడాయె" అన్నాడు కోదండరాంరెడ్డి.

అక్కడే ఉన్న బ్రహ్మారెడ్డి మధ్యన కలిగించుకుని "చూడు కోదండన్నయ్యా మగపిల్లాడి తండ్రి కాబట్టి ఏడుకు ఏడు వాయిదా వేసుకుంటూ వస్తున్నాడు. ఇట్లా వాయిదా వేయడం ఆడపిల్లలు గలవాళ్లం మాకెట్లా ఉంటుందో చెప్పు" అన్నాడు.

"నిజమే బ్రహ్మయ్యా, ఆడపిల్లలు గలవాళ్లకు తొందరెక్కువగానే ఉంటుంది. కాని ఇన్నిరోజులు ఎట్లాగూ ఆగావుగదా, ఈ వానాకాలం వెళ్లిపోగానే మూడుముళ్లూ వేయించు" అన్నాడు కోదండరాంరెడ్డి.

"మా పెద్దిబావయ్య ఈ సంవత్సరం కూడా ఆగమంటాడేమో" అన్నాడు బ్రహ్మారెడ్డి.

"ఎందుకులే బ్రహ్మయ్యా. వచ్చే మాఘమాసంలో పెళ్ళి ఏర్పాట్లు చేద్దాం" అన్నాడు పెద్దిరెడ్డి.

"మాటతప్పవుగదా?" అన్నాడు బ్రహ్మారెడ్డి నవ్వుతూ.

పెద్దిరెడ్డి నవ్వి "మాటంటే మాటే. మాటకు తిరుగుంటుందా బ్రహ్మయ్యా?" అన్నాడు.

"శుభం, కానీయండి. మాఘంలో మంచి లగ్నాలే ఉంటాయి. చూడమంటారా?" అన్నాడు సుబ్రహ్మణ్యశాస్త్రి.

"ఇప్పుడే చూడడమెందుకండీ? ఎంతలేదన్నా మాఘమాసం దాదాపు ఆరునెలలపైగా ఉంది" అన్నాడు సుబ్రహ్మణ్యశాస్త్రి.

"అవునవును. ఒఠ్ఠి చాదస్తపు మనిషినయ్యా. ఒక్కొక్కప్పుడు ఇట్లాగే ఆలోచనలేకుండా మాట్లాడుతుంటాను" అన్నాడు సుబ్రహ్మణ్యశాస్త్రి. ఆయన మాటలకు అక్కడివారంతా నవ్వుతూ ఇళ్లకు బయల్దేరారు.

❋❋❋

"శ్రీ మద్రమారమణ గోవిందోహరి" అంటూ అందరూ గోవిందలుకొట్టారు. అందరి చేతుల్లో ఉన్న భజన చెక్కలు ఒక్కసారిగా ఘల్లుమని మోగినయ్.

"బాల గోపాలక్రిష్ణా" అంటూ యాదవరెడ్డి పాట ఎత్తుకున్నాడు. చుట్టూ వలయాకారంగా నిలబడివున్న యువకులు వంతపాడుతూ చేతుల్లోని చెక్కలను లయ తప్పకుండా మోగిస్తున్నారు.

"తక తదిగిణత" అంటూ వరుస



ఎత్తుకున్నాడు యాదవరెడ్డి. ఆ మరుక్షణమే అడుగు ప్రారంభం అయింది. గిర్రున తిరిగి ఒంటికాలిపై కూర్చునిలేచి ఒకరినొకరు చుట్టివేసుకుంటూ పరుగులు పెడుతున్నారు. నెమళ్లు పురివిప్పి నాట్యంచేసిన మాదిరిగా కనిపిస్తోంది. భజన చూడవచ్చిన వారంతా తలలూపుతూ తన్మయులైపోతున్నారు. కొద్దిదూరంలో మొండిగోడపై కూర్చున్న ప్రతాప్‌రెడ్డి, బొర్రకనకం తప్పటడుగులు చూసి నవ్వుతున్నాడు.

అప్పటికే రాత్రి పదిగంటల పొద్దుపోయింది. చివరికి ప్రతాప్‌రెడ్డి మొండిగోడ దిగి భజన చేస్తున్న వారి మధ్యకు వెళ్లి నిల్చున్నాడు. అతన్ని చూడగానే భజన ఆపేశారు.

"ఏమిటి ప్రతాప్?" అనడిగాడు యాదవరెడ్డి.

"నీ కోసమే వచ్చాను. చాలా సేపయింది" అన్నాడు ప్రతాప్‌రెడ్డి.

"అయితే భజన చాలించి లేస్తాములే" అన్నాడు యాదవరెడ్డి. భజనచెక్కలు తీసి చంకలో పెట్టుకున్నాడు. "డబ్బెం తీసి గుడిలో పెట్టండిరా" అన్నాడు. అతడు ప్రతాప్‌రెడ్డి వెంట బయలుదేరాడు. వారిద్దరివెంట మల్లారెడ్డి. కృష్ణారెడ్డి వగైరా యువకులందరూ బయల్దేరారు.

అందరు నర్కారీ చావిడిలోకి చేరుకున్నారు.

"యాదవా, జిల్లా కమిటీ నుండి ఆదేశం వచ్చింది" చెప్పాడు ప్రతాప్‌రెడ్డి.

"ఏమిటది?" అడిగాడు యాదవరెడ్డి.

"మన గ్రామంలో ఒక దళం ఏర్పాటు గావించుకుని త్వరలో కార్యరంగంలోనికి దిగాలని ఉంది"

"మనం దిగే కార్యరంగం ఏమిటి?" అడిగాడు మల్లారెడ్డి.

"ముందుగా తాడిచెట్లు, ఈదులు నరికివేయాల" చెప్పాడు ప్రతాప్‌రెడ్డి.

"అమ్మయ్యో నర్కారీ వాళ్లూరుకుంటారా?" అన్నాడు చాకలి కైలాసం.

(ఇంకా వుంది)

క్యాంపస్ ఛాట్

కె. హిమ

ఇంత ఎండలోనూ...

మీరు బస్సులో ప్రయాణిస్తున్నారా? మోటారు బైక్‌పై రయ్‌మంటూ దూసుకుపోతున్నారా? పై అంతస్తులోని బాల్కనీలో నిలుచుని కిందకు చూస్తున్నారా? ఎలా అయితే ఏముందిలేండి. ఎన్ని దారులున్నా గమ్యమొక్కటే అంటారు కదా అలాగే ఈ ప్రశ్నలన్నీ ఒక విషయం గురించే. అందేంటంటే... ఎండ తగలకుండా



తలపై దువట్టా వేసుకునో... తడారిపోతున్న పెదవులను తడిచేసుకుంటూనో... పుస్తకాలు తలకు అడ్డుపెట్టుకునో... రోడ్డుపై నడుస్తున్న విద్యార్థులు మీ చూపులను దాటిపోలేరు మరి. అవునా?

'ప్చ్ పాపం! వీళ్లకెన్ని కష్టాలు కదా... ఇంత ఎండలోనూ వీళ్లకీ బాధతప్పలేదు. వీళ్లనిలా చూస్తుంటే మాకే ఇంత బాధగా ఉందే... మరి ఎలా తట్టుకుంటున్నారో పాపం' అన్పించడం సహజం. వీళ్లను చూసినప్పుడు మీరిలానే బాధపడ్డారా? అయితే నిస్సందేహంగా మీ ఆలోచనా విధానాన్ని రిఫ్రెష్ చేసుకోవడం అవసరం. దాంతోపాటు ఈ విద్యార్థులెలా ఫీలౌతున్నారో తెలుసుకోవడమూ ముఖ్యమే.

"నేను ఐసెట్‌కు ప్రిపేరవుతున్నాను. పొద్దున్నే ఆరున్నరకల్లా వెళ్లాలి. ఇక బ్రేక్‌ఫాస్ట్ సంగతంటారా? అంతత్వరగా అస్సలు తినాలనిపించదు. క్లాసులన్నీ అయిపోయేసరికి మధ్యాహ్నామవుతుంది. హమ్మయ్యా... అనుకోవాల్సిన పనేలేదు. ఎందుకంటే అప్పుడే మొదలౌతుంది అసలు కథ. బస్సుకోసం అంత ఎండలో వేచి చూడాలంటే మాటలా? ఉన్న కాస్త శక్తీ హరించుకుపోతుంది. ఈసురోమంటూ ఇంటికి చేరుకునేసరికి అన్నం తినాలన్న ఉత్సాహమూ ఉండదు. క్లాసులో ఉన్నప్పుడు మాత్రం ఇవేవీ గుర్తుండవు. ఎందుకంటారా? కొత్త ఫ్రెండ్స్, కొత్త లెక్చరర్స్... చాలా థ్రిల్లింగ్‌గా ఉంటుంది" అంటోంది ఐసెట్ ఎంట్రన్స్‌కు సిద్ధమౌతున్న హర్షిత.

"ఎందుకో... నాకు ఈ బాధలు...." చెల్లాయ్ ఫ్రెండ్స్‌తో సినిమాకు చెక్కేస్తుంటే... బాధగా కాలెండర్‌ను చూస్తూ, పరీక్షల కౌంట్‌డౌన్ లెక్కించడంలో మునిగిపోయాడో అన్నయ్య.

"ఛీ... ఛీ... హాలిడేస్‌లోనూ ఈ బాధతప్పేట్లు లేదు" అనుకుంటాడు హాయిగా నిద్రపోతున్న కుటుంబ సభ్యులను చూసిన ఓ విద్యార్థి.

"ఈ బతుక్కి ఒక ఎంజాయ్‌మెంటనేదే లేదు..." హాయిగా ఎంజాయ్ చేస్తున్న వారిని చూసి భగ్గుమంది మరో హృదయం.



అయితే వీరు ప్రతిసారీ ఇలాగే ఆలోచిస్తారని భావించకండి. ఎందుకంటే కేవలం ఒక్క నిమిషం మాత్రమే ఇటువంటి ఆలోచనలతో వారి మనసు ఉక్కిరిబిక్కిరవుతుంది మరి. ఆ మరుక్షణమే వీరేమనుకుంటారంటే... "హమ్మో... సినిమాలు కావాలంటే ఎప్పుడైనా చూసుకోవచ్చు. ఇట్స్ ద టైమ్ టు స్టడీ" అనుకుంటూ చదవడంలో మునిగిపోతామంటూ చాలామంది విద్యార్థులు సమాధానమిచ్చారు.

"నేను చాలా రిజర్వ్‌డ్‌గా ఉంటాను. కోచింగ్‌లో లేట్‌గా జాయిన్ అయ్యాను. మా ఇనిస్టిట్యూట్‌లో ఒకబ్బాయి చాలా శ్రద్ధ తీసుకుని అప్పటివరకు పూర్తయిన సిలబస్ ఎక్స్‌ప్లెయిన్ చేశాడు. ఒకే... అక్కడివరకూ బాగానే ఉంది. ఆ తరువాత నుంచీ, అవసరమున్నా లేకపోయినా పలకరించడం మొదలెట్టాడు. నేను వేరే అబ్బాయిలతో మాట్లాడితే... "ఆ గ్యాంగ్ మంచిది కాదు...." అంటూ షురూ చేసేవాడు. అతని వాలకం చూసి, "ఎవరే అతను, నీకేమౌతాడు?" అనడిగిందో అమ్మాయి. "ఆ... క్లాస్‌మేట్" అని చెప్పాన్నేను కాస్త చిరాగ్గా. బస్టాండుకూ నా వెంటే వచ్చేవాడు. కారణమడిగితే "మీరు ఒంటరిగా వెళుతున్నారు కదా. కాస్త కంపెనీగా ఉంటుందని వచ్చా అంతే'' అన్నాడు. ఇక నేనేం మాట్లాడలేకపోయాను. ఒకరోజు... 'మీ మొబైల్ ఇస్తారా' అనడిగాను. ఓ పావుగంట తర్వాత తిరిగిచ్చేశాను. అతను ఉండబట్టలేక 'ఎవరితో మాట్లాడారో తెలుసుకోవచ్చా?' అని అడిగాడు. నేను 'మా బావతో...' అన్నాను. అంతే అతని మొహం వాడిపోయింది. నిజానికి నేను మాట్లాడింది మాత్రం మా స్నేహితురాలితో. "ఒసేయ్ వేరే కోచింగ్ సెంటర్స్ మెటీరియల్స్ తీసుకున్న తరువాత ఇలా చెప్పి ఉండాల్సిందే... పిచ్చిమొహమా..." ఈ విషయాన్ని మా ఫ్రెండ్స్‌కు చెప్పినప్పుడు వారి స్పందన ఇలా ఉంది. "ఆ మెటీరియల్ కోసం నేను ఈ బాధను భరించడం, ఈ మెంటల్ టెన్షన్‌ను సహించడం అవసరమా" అనుకున్నాన్నేను అని చెబుతున్న ప్రగతి ఎమ్మెస్సీ ఎంట్రన్స్‌కు ప్రిపేరవుతున్న విద్యార్థిని.

"మాకు రోజూ ఏడుగంటలకే క్లాసులు మొదలౌతాయి. నేను మాత్రం ఎనిమిది గంటలకెళతాను. ఆలస్యంగా క్లాసులోకి ఎంటరవుతున్న నన్ను, అందరూ విచిత్రంగా చూసేవారు. ఓరోజు మా లెక్చరర్ కారణమడిగాడు... అలారం మోగలేదు సర్" అని చెప్పాను. ఆ తరువాతి రోజునుంచి మా క్లాస్‌మేట్స్ నన్ను చూసి 'పాపం అలారం మోగలేదేమో రా' అంటూ గట్టిగానే కామెంట్ చేసేవారు. ఎప్పుడైనా త్వరగా వస్తే ఏదో అద్భుతం జరిగినట్లుగా చూడడం మొదలెట్టారు. ఇదెక్కడిగోలరా బాబూ... అనుకుని ఆరోజు నుంచీ సాధ్యమైనంత త్వరగానే రెడీ అవ్వడానికి ట్రై చేసేదాన్ని. ఏంటో నేను త్వరగా రెడీ అయితే బస్‌లేటుగా వచ్చేది. నేను లేట్‌గా రెడీ అయితే ఆ బస్సు ముందెళ్లిపోయేది. మొత్తానికి నా టైంకే నేను క్లాసుకి వెళ్లేదాన్ని." అంటోంది సునీత.

మీరేంటి ఇలా ఊహాల్లో తేలిపోతున్నారు. మీరు కోచింగ్ తీసుకుంటున్న రోజులు గుర్తొచ్చాయా? ఒకే కారీ ఆన్... *

సినిమా కబుర్లు

సినీరంగ ప్రవేశమే భలే తమాషా

ముదిగొండ సాంబశివరావు

సినీసంద్రంలో పడిలేచే కెరటాలెన్నో. అలా ఉవ్వెత్తున లేచిపడిన నట తరంగమే టి.కనకం. అటు రంగస్థలంపైన, ఇటు సినిమాల్లోనూ విభిన్న, విలక్షణ పాత్రలు ధరించిన ఆమె నేటి తరానికి తెలియని నాటి తరం నటి. యాక్షన్లు, రియాక్షన్లు, డ్రామాలు మెలో డ్రామాల విషాదాంతాలు, సుఖాంతాలు సినీ ప్రపంచంలో ఎన్నెన్నో. ఈ జిలుగువెలుగుల వెనుక చెప్పలేనన్ని రాగద్వేషాలూ, ఈర్ష్యా సూయలూ, ఎత్తుపల్లాలు అనేకం. సినీ వైకుంఠపాళిలో ఎగదోసే నిచ్చెనలు కొన్నే. పడగొట్టే పాములు ఎన్నో. 'కీలుగుర్రం', 'గుణసుందరి కథ', 'షావుకారు', 'శ్రీలక్ష్మమ్మకథ', 'రక్షరేఖ', 'దాసి', 'ప్రియురాలు', 'బాలనాగమ్మ', 'భక్త ప్రహ్లాద', 'అవేకళ్లు'...ఇలా దాదాపు 75 కు పైగా చిత్రాల్లో నటించారు టి.కనకం. ప్రస్తుతం విజయవాడలో ఉంటోన్న ఆవిడ తాను కాచి వడపోసిన అనుభవాలనూ, జ్ఞాపకాలనూ ప్రజాశక్తితో పంచుకున్నారు.

ఆ రోజుల్లో నటీనటులకు సంగీతంలో ప్రవేశం ఉంటేనే, బాగా పాడగలిగితేనే వేషాలు లభించేవి. నాటకాల నుంచి సినిమా రంగానికీ, అందులోంచి మళ్లీ నాటకరంగానికి నా సుదీర్ఘ ప్రస్థానం జరిగింది. పుట్టింది పశ్చిమబెంగాల్‌లోని ఖరగ్‌పూర్‌లో అయినా పెరిగింది విజయవాడలోనే. మద్రాన్‌లో నివాసం. తర్వాత మళ్లీ తిరిగి విజయవాడకు చేరాను. మేడలు, మిద్దెలు, కార్లు సంపాదించాను. ఇవాళేమీ లేవు. సిరి ఎలా వరించిందో తిరిగి అలాగే వెళ్లిపోయింది.

టి.కనకంగా చిత్రసీమకు పరిచయమై పేరు తెచ్చుకున్న నా అసలు పేరు తెలుగు కనకదుర్గమ్మ. తండ్రి పేరు అప్పలస్వామి, తల్లిపేరు షోలాపురమ్మ (ఖరగ్‌పూర్ దేవత). 1930లో పుట్టాను. నా వయసు 76 సంవత్సరాలు. మా నాన్న రైల్వేలో డ్రైవర్‌గా ఫనిచేశారు. రైలు ప్రయాణంలో ఎన్ని స్టేషన్లు ఉంటాయో అన్ని బదిలీలు ఉండేవి నాన్నగారికి. అలా తిరిగితిరిగి వచ్చి విజయవాడలో సెటిలయ్యాము. నాకు ఐదుగురు అక్కాచెల్లెళ్లు, ఒక్కడే తమ్ముడు. నా విద్యాభ్యాసమంతా ఇంగ్లీషు కాన్వెంట్ ఆర్.సి.ఎం. స్కూల్లో జరిగింది. అయినా తెలుగు భాషమీద మంచి పట్టు ఉండేది. ఎనిమిదో ఫారం తర్వాత మున్సిపల్ స్కూల్లో చదివాను.

నాకున్న తెలుగు అభిలాషను గమనించిన తెలుగు మాస్టారు నరసింహాచారిగారు మచిలీపట్నంలో తెలుగు పండిట్ కోర్సు చేయమని సలహా ఇచ్చారు.

నాకున్న తెలుగు అభిలాషను గమనించిన తెలుగు మాస్టారు నరసింహాచారిగారు సుభద్రా కల్యాణం, విజయ విలాసం కావ్యాల్ని కంఠస్థం చేయించారు. తెలుగుభాషలో నాకున్న ప్రజ్ఞచూసి మా మాస్టారు మచిలీపట్నంలో తెలుగు పండిట్ కోర్సు చేయమని సలహా ఇచ్చారు. మా అమ్మమ్మ పాతకాలం మనిషి. 'బ్రతకలేక బడిపంతులా...' అని దీర్ఘాలు తీసింది. దాంతో నా చదువు కొండెక్కింది.

విజయవాడ పూర్ణానందంపేటలో ఉండేవాళ్లం. రైల్వే ఉద్యోగులంతా ఉండే ప్రాంతమిది. ఆంధ్రపత్రిక సెంటర్ (గాంధీనగర్)లోని కౌతా పూర్ణానందం సత్రంలో నాటక బృందాల రిహార్సల్స్ జరుగుతుండేవి. పక్కనే హనుమంతరాయ గ్రంథాలయంలో ప్రదర్శనలిస్తుండేవారు. ఖాళీగా ఉన్న నేను కిటికీకి వేలాడబడి వాళ్ళ రిహార్సల్స్ చూస్తుండేదాన్ని. సుంకర కనకారావుగారి కనకదుర్గా నాట్యమండలి రిహార్సల్స్ జరుగుతుడేంది. అప్పుడప్పుడు అక్కడికి తాపీ ధర్మారావుగారు వస్తుండేవారు. ఒకరోజు నన్ను అడిగారు నీకు ఆసక్తి ఉందా అని. ఉందని చెప్పాను.

నేను గాత్రసంగీతం ఒకరి దగ్గర నేర్చుకున్నది కాదు. నాకు కర్ణపిశాచం ఉంది. విని నేర్చుకున్నదే. అయితే మా ఇంట్లో కళాకారులు లేకపోలేదు. మా బావగారు ఎం. దుర్గారావు హార్మోనిస్టు. రాయలసీమ నాటకాలకు ఆయనే హార్మోనిస్టు. మరో బావగారు నల్లంచి అప్పారావు ఒక ట్రూపుకు ఆర్గనైజర్. నా మొదటి నాటకం 'ప్రతిమ'. అప్పుడు నాకు పన్నెండేళ్లు. మొదటిసారిగా ప్రతిమా సుందరి వేషం ఎలాంటి బెరుకూ లేకుండా వేశాను. సత్యహరిశ్చంద్రలో లోహితాస్యుడు వేషం ఇచ్చారు. తర్వాత ప్రహ్లాదుడు, బాలకృష్ణుడు ఇలా ఒకటేమిటి అన్ని బాలపాత్రలూ నావే.

ఇక నా సినీరంగ ప్రవేశం తమాషాగా జరిగింది. వయసొచ్చిన పిల్లను కావటంతో పెళ్లి ప్రయత్నాలు మొదలుపెట్టారు. నాకేమో నాటకాలమీద ఆసక్తి. మహారాష్ట్రకు చెందిన ఓ డాక్టరుతో పెళ్లి నిశ్చయించేశారు. నాకాపెళ్లి ఇష్టం లేదు. అతనికి ఇది ద్వితీయ వివాహం. దాంతో పెళ్లి చేస్తారనే భయంతో ఏం చేయాలో తెలీక మద్రాస్ బండెక్కేశాను. నాలుగు పావడాలు, నాలుగు ఓణీలు, కొద్దిపాటి డబ్బుతో ఉడాయించాను. నేను అంత ధైర్యంగా మద్రాసు వెళ్లడానికి కారణం. నాకు నాటకాల్లో వేషం ఇచ్చిన లలిత ఎమెచ్యూర్స్ అప్పుడు అక్కడే ఉంది. తాపీధర్మారావుగారు మొదటిసారి ఆసక్తి ఉందా అని అడిగారు కనుక ఆయన్ను వెతుక్కుంటూ వెళ్లాను. నటి జువ్వాది గంగారత్నం ఇంట్లో బసచేశాను. తాపీ ధర్మారావుగారే ఆలిండియా రేడియోకి తీసికెళ్లారు. అక్కడ బి.ఎ.సుబ్బారావు సోదరుడు బి.ఎ.రామారావు ఆధ్వర్యంలో జానపద గీతాలు పాడుతుండేదాన్ని. త్రిపురనేని గోపీచంద్, బి.ఎన్.రెడ్డిగార్లు అక్కడే పరిచయం అయ్యారు.

ఇంకా వుంది...

బాలనేస్తాలు

పోస్ట్‌మేన్‌కి సాయం చేద్దాం



ఎవరి ఇల్లు ఏదో!



మేం చెప్పిన రంగులద్దండే

1.రెడ్ 2.ఎల్లో 3.మెరూన్ 4.బ్లూ 5. పింక్ 6. గ్రీన్.



హంప్టీ డంప్టీ పజిల్ బ్యాగ్ చేద్దాం

హేయ్ బుజ్జాయిలూ...! ఇవాళ మనం హంప్టీ డంప్టీ పజిల్ బ్యాగ్ తయారుచెయ్యడం ఎలాగో తెలుసుకుందామే! హంప్టీడంప్టీ అంటే మరేదో కాదు. ఒక కోడిగుడ్డు. అది ఓసారి ఒక గోడ ఎక్కి దొర్లి కింద పడిపోతుందిలే. దాన్ని మనం ఇవాళ పజిల్‌లాగా చెయ్యబోతున్నాం. ముందు మీరు ఒక మందపాటి అట్ట ముక్క తీసుకోండి. దానిమీద తెల్లటి కాగితం అతికించండి. తర్వాత కోడిగుడ్డు ఆకారం గియ్యండి. అందులో కళ్లు, ముక్కు నోరు కూడా గియ్యాలి. దాన్ని జాగ్రత్తగా కొన్ని ముక్కలుగా కత్తిరించండి. ఇప్పుడు ఒక పేపర్ బ్యాగ్ (అట్టపెట్టె)తీసుకోండి. దానిమీద గోడలాగా స్కెచ్‌పెన్నులతో గియ్యండి. ఎంచక్కా ఆ బ్యాగ్‌లో హంప్టీడంప్టీ ముక్కలు వెయ్యండి. అంతే పజిల్ రెడీ. దీన్ని మీ నేస్తాలకు ఇచ్చి హంప్టీడంప్టీని అతికించమనండి.

పనిలోపనిగా టైమ్‌కూడా పెట్టండి. ఆ టైమ్‌లోపు అతికించలేకపోతే... వాళ్లు ఓడిపోయినట్టు. అతికించగలిగితే గెల్చినట్టు. బావుందికదూ. ఇలా మీరు ఎన్ని బొమ్మలైనా తయారుచేయొచ్చు. మరి సెలవుల్లో బోర్ కొట్టకుండా వుండాలంటే... ఇలాంటి పనులుకూడా చేయాలన్నమాట. వచ్చేవారం మరో బొమ్మతో మీ ముందుంటామే. బైబై నేస్తాలూ.

చిన్నారి చిత్రకారులు

ఏ రెండు ఒకేలా వున్నాయి?



పూరిద్దాం



అట్టమీది కథ

మొబైల్... మొబైల్...

కె శివలీల

ఇవాళ్టి ఉరుకులూపరుగుల జీవితంలో ఇంట్లో కాళ్ళారజాపుకుని కూర్చునే వీలు ఎప్పుడోగానీ దొరకదు. అలాని అన్ని ఆశలూ చంపుకుని, ఏ కాలక్షేపమూ లేక నీరసంగా, నిస్తేజంగా కాలయాపన చేస్తూ యంత్రాల్లా బ్రతకనక్కర్లేదు. ఏ ఆఫీసులోనో కానేపు తీరిక చిక్కుతుంది... పనిమీద బయటకు వెళ్ళి నపుడు కొంతసేపు వేచివుండాల్సిన అవసరం వస్తుంది. లేదా రైల్లోనో, కార్లోనో పయాణిస్తున్నపుడు ఏమీ తోచదు. మరి ఇలాంటి సమయాన్ని గోళ్ళు కొరుక్కుంటూ లేదా శూన్యంకేసి చూస్తూ వృథా చేయనవసరం లేదు.

ఎందుకంటే ఆ విరామ సమయాన్ని కూడా సుఖంగా, సంతోషంగా గడిపేందుకే మొబైల్ ఫోన్లు, మొబైల్ టీవీలు, మొబైల్ డి.వి.డి. ప్లేయర్లు వచ్చాయి. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది మొబైల్ యుగం. నడుస్తూ మాట్లాడతాం. ప్రయాణిస్తూ పాటలు వింటాం, టీవీ చూస్తాం. ఓ సూట్‌కేస్‌లో ల్యాప్‌ట్యాపు, పోర్టబుల్ డి.వి.డి. ప్లేయరు, జేబులో సెల్‌ఫోను వుంటే చాలు ప్రపంచంలో ఏ మారుమూలకెళ్ళినా ఏమీ మిస్సయ్యేదుండదు అంటున్నారు ఈ తరంవాళ్ళు. ఈ నేపథ్యంలో మొబైల్స్‌మీద ప్రత్యేక కథనం.

ధీరజ్ బస్టాండులో నిలబడ్డాడు. బస్ వస్తుందో... రాదో అనే ఆందోళన అతని కళ్లలో మచ్చుకైనా కనిపించట్లేదు. కాసేపటికి 'వావ్... వియ్ గాట్ ఇట్...మనం గెలిచాం...!' చెవులు చిల్లులుపడేట్లు అరిచాడతను. ఇతనికేమన్నా పిచ్చా...? ఎందుకిలా అరుస్తున్నాడు. అసలేంటి సంగతి? మ్యాచ్‌ను ప్రత్యక్షంగా చూశాడు. ధీరజ్ మ్యాచ్ చూసింది తన మొబైల్‌లో. మొబైల్‌ఫోన్‌లోనా... క్రికెట్ మ్యాచా... అదెలా సాధ్యం? అనుకుంటున్నారు కదూ. మొబైల్ టీవీలు అది సాధ్యమనే చెబుతున్నాయిమరి.

ఇప్పుడిక తాజాగా విడుదలైన పోర్టబుల్ డి.వి.డి. ప్లేయర్లలో వీడియో, గేమ్ సిస్టమ్, కెమెరా, రికార్డింగ్ మొదలైన సదుపాయాలన్నీ వున్నాయి. ప్రయాణంలో దీన్ని వినియోగించుకునేందుగ్గానూ చక్కటి ఫోల్డబుల్ స్టాండు కూడా వుంటుంది. ఇంత ఎంటర్‌టైన్‌మెంట్ మనచేతిలోనే వుంటే ఇక ప్రయాణంలో అలుపూసొలుపుల ప్రసక్తి వుంటుందా మీరే చెప్పండి. ఎంతో దూరం ప్రయాణించాక్కూడా 'అయ్యో అప్పుడే వచ్చేశామా' అనిపించినా ఆశ్చర్యంలేదు.

'ఈ వెధవ బస్సు ఎంతకీ రాదు... కూర్చుందామంటే స్థలమూ లేదు. నిలబడీ... నిలబడీ కాళ్లు లాగేస్తున్నాయ్. ఇంట్లోనే ఇంకాసేపున్నా బాగుండేది. క్రికెట్టయినా చూసేపని... స్కోరెంత పెరిగిందో ఏంటో... ద్రవిడ్ ఉన్నాడో పోయాడో...' అనుకుంటూ బాధపడాల్సిన పనిలేదు. 'అయ్యో ఈ షాపింగు పనే లేకపోతే హాయిగా టీవీ చూసేదాన్ని కదా. అసలే ఆ సీరియల్ సస్పెన్సుగా సాగుతోంది. ఇంతకీ ఆ అమ్మాయి ఎవర్ని ప్రేమిస్తుందో ఏంటో...' అని దిగులు పడాల్సిన పరిస్థితి అసలే రాదు. 'రాహుల్... కామన్ వెల్త్ గేమ్స్‌లో ఇండియా ఎన్ని స్వర్ణాలు సాధించిందో చెప్పవూ...' అని టీవీ క్యాబిన్‌లో ఉన్న సహోద్యోగిని ఎంక్వైరీ చేయాల్సిన అవసరమే రాదు. వావ్... ఇది నిజమేనా అని ఆశ్చర్యపోతున్నారు కదూ?! అవును, నిజమే. ఇదంతా మొబైల్ టెలివిజన్ చలవే.

★★★★

"ఎంసెట్‌కు ప్రిపేరవుతున్నాను. మంచి ర్యాంక్ సాధించాలంటే చదవడంతోపాటు ఏకాగ్రత చాలా అవసరం. అందుకే టీవీ అస్సలు చూడకూడదనుకుంటాను. కానీ పాటలు వస్తుంటే చాలు నా చెవులు అవే రిక్కించుకుంటాయి. కాళ్లు టీవీరూం వైపుకు పరుగులు తీస్తాయి. ఎక్కడో పక్కరూంలోనో, ఎదుటి పోర్షన్‌లోనో టీవీ సౌండ్ వినిపిస్తేనే మనం టెంప్ట్ అయిపోతామే. మరి ఇరవైనాలుగ్గంటలూ మన చేతుల్లోనే ఉండే మొబైల్‌లో టీవీవస్తే ఇక పరిస్థితెలా ఉంటుందో ఆలోచించాల్సిన విషయమే..." అంటాడు ఫణికుమార్. ఇవన్నీ సరే... ఇంతకీ ఈ టీవీ ఎక్కడ

అందుబాటులో ఉంది? దాని కథాకమామీషు ఏంటి?

ఈ మొబైల్ టీవీని మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టింది దక్షిణ కొరియన్లు. అంతేకాదండోయ్... అక్కడి ప్రభుత్వం తమ ప్రజలకు మొబైల్‌టీవీ కార్యక్రమాలను ఇరవైనాలుగ్గంటలూ ప్రసారం చేస్తోంది. అదీ ఉచితంగా. అబ్బ! ఈ అవకాశం మనకీ వస్తే ఎంత బాగుండు. ఎంచక్కా డే అండ్ నైట్ క్రికెట్ మ్యాచ్‌ను, మిస్ ఇండియా కాంటెస్టును ఒకటేమిటి ఇష్టమైన ప్రోగ్రామ్సన్నీ చూడొచ్చు. టీవీముందే కూర్చోవాల్సిన బాధ తప్పుతుంది. ఆగండాగండి... మీ అమూల్యమైన ఊహలకు అడ్డుకట్ట వేస్తున్నాననుకోకపోతే ఈతరం అబ్బాయిల ఫీలింగ్స్ ఎలా ఉన్నాయో ఒకసారి తెలుసుకోండి.

"మొబైల్... అంటేనే పూర్తిగా మన పర్సనల్... ఏ ఛానల్ చూస్తే ఎవరేమనుకుంటారో అన్న భయమే ఉండదు. ఇష్టమొచ్చిన ఛానల్‌ను సర్ఫింగ్ చేయొచ్చు. మమ్మీడాడీలు చూస్తారన్న టెన్షనే లేదు" అని సంబరపడుతున్న ఈ టీనేజీ అబ్బాయి మాటలు విని "అమ్మో... కొంచెం జాగ్రత్త పడాల్సిన విషయమే" అంటున్నారు తల్లిదండ్రులు. మరి కొందరైతే... "మా అమ్మాయేమో ఎంటీవీ కావాలంటే... మా అబ్బాయి టెన్‌స్పోర్ట్స్ ఛానలంటాడు. కాలేజీ ఉన్నరోజుల్లోనే వీళ్ల గొడవతో ఇల్లంతా రణరంగమౌతుంటే... ఇక సెలవల్లో ఎలా ఉంటుందో చెప్పాల్సిన అవసరమే లేదు. అందుకే వేం ఇంకో టీవీ కొనాలనుకుంటున్నాం. కానీ ఈ మొబైల్ టీవీ గురించి విన్నతర్వాత ఆ ప్రయత్నం విరమించుకోవాలనిపిస్తోంది. మొబైల్ టీవీ కొనిస్తేనే బెటర్ కదా. లేటెస్ట్ మోడల్ కొనిచ్చినట్లూ ఉంటుంది. మాకు ఇంకో టీవీ కొనే బాధా తప్పుతుంది'' అని సరిపెట్టుకుంటోందో మాతృమూర్తి.

సరే, సెల్‌ఫోన్‌లో టెలివిజన్ ప్రసారాలు రావడం బాగానే ఉంది. ఇంతకీ దీని బ్యాక్‌గ్రౌండ్ ఏంటి? ఇవెవరికి అందుబాటులో ఉన్నాయి? ఈ టెక్నాలజీనేమంటారు? ఆ వివరాల్లోకెళ్తే దీన్నే డిజిటల్ మల్టీమీడియా బ్రాడ్‌కాస్టింగ్ లేదా డిఎంబి అంటారు. ఈ టెక్నాలజీని ఉచితంగా ప్రసారం చేస్తోంది దక్షిణకొరియన్లే. ఈ సాంకేతిక పరిజ్ఞానాన్ని మరికొన్ని ప్రాంతీయ కేంద్రాలకు, ఇతర ఉప కేంద్రాలకు విస్తృతం చేయాల్సిందిగా ఇక్కడి ప్రభుత్వం భావిస్తోంది. 2010నాటికి పదిహేను మిలియన్ల కొరియన్లు ఈ మొబైల్ టెలివిజన్‌ను వినియోగిస్తారని ఒక అంచనా. టీవీ స్క్రీన్‌తో పోల్చితే మొబైల్ టీవీ స్క్రీన్ చాలా చిన్నది. మరి అంత చిన్న స్క్రీన్‌లో దృశ్యాలు చూడడమెలా సాధ్యం? ఇదంతా స్క్రీన్ టెక్నాలజీ మహిమే అని చెప్పొచ్చు. మొబైల్ టీవీలో ప్రసారమయ్యే కార్యక్రమాలు చూస్తుంటే సాధారణ టీవీని చూసినట్లే అనిపిస్తుందని వినియోగదారులంటున్నారు. గత సంవత్సరం మే నుంచే ఈ ఉపగ్రహ ఆధారిత డిఎంబి సర్వీసులు పేఛానల్స్‌గా అందుబాటులోకొచ్చాయి. గత జనవరిలో 40వేల లాండ్‌ఫోన్ వినియోగ దారులుంటే, మేలో 440 వేలమంది డిఎంబి ఫోన్ సర్వీసులకొరకు దరఖాస్తు చేసుకున్నారని కొరియాకు సంబంధించి ఒక సంస్థ తానుచేసిన సర్వేలో పేర్కొంది.

వెస్టన్ అభిరుచులకు అను గుణంగా...

ఎల్‌జీ ఆల్ఫా, బీటా అనే రెండు ప్రొటోటైప్ హాండ్ సెట్లను అమెరికన్ మార్కెట్లో ప్రవేశ పెట్టింది కొరియా. అమెరికన్లూ ఈ అత్యాధునిక టెక్నాలజీని సొంతం చేసుకో వడానికే ఆరాట పడుతున్నారు. దీంతో పాశ్చాత్య దేశీయుల అభిరుచులకు అనుగుణంగా తమ ఉత్పత్తులను తయారు చేయాలనే కొరియన్ల వ్యూహాత్మక ప్రణాళిక విజయవంతమైంది. ఈ రెండు హాండ్‌సెట్లకూ భారీ పెట్టుబడి పెట్టాల్సివచ్చినా మార్కెట్లో వీటిపట్ల పెరుగుతున్న క్రేజుకూడా వెరుగ్గానే ఉందని పరిశోధకులంటున్నారు. ఉత్తర అమెరికాలో సాగిస్తున్న సెల్‌ఫోన్ అమ్మకాల్లో ఎల్‌జీ, శాంసంగ్‌లు రెండవ, నాల్గవ స్థానాల్లోనూ, మోటొరోలా, నోకియాలు మొదటి, మూడవ స్థానాల్లోనూ ఉన్నాయని ఒక మార్కెటింగ్ రీసెర్చి సంస్థ పేర్కొంది. ఇటీవలే నోకియా 7710 హాండ్‌సెట్ మార్కెట్లోకి ప్రవేశించింది. ఇది వైడ్‌స్క్రీన్ మల్టీమీడియా స్మార్ట్‌ఫోన్. డిజిటల్ టీవీ సంకేతాలను గ్రహించే శక్తి దీనికుంది. మనం ప్రయా ణంలో ఉన్నా దీనిలో ప్రసారమయ్యే దృశ్యాలను స్పష్టంగా చూడగలుగుతాం.

మార్కెట్లోకి విస్తృతంగా వస్తున్న ఈ మొబైల్ ఫోన్ల పరంపర మొబైల్ కంపెనీలమధ్య యుద్ధవాతావరణమే నెలకొల్పింది. ఈ పోటీనెదుర్కొనే దిశగా చాలా కంపెనీలు సుదీర్ఘ చర్చలు, సమాలోచనలు జరుపుతున్నాయి.



శాంసంగ్, ఎల్‌జీ కంపెనీలు కూడా ఈ కొత్తతరం మొబైల్‌ఫోన్‌లను మార్కెట్లో ప్రవేశపెట్టబోతున్నాయి. మరోపక్క నోకియా తన మొబైల్‌టీవీని మార్కెట్లోకి లాంచ్ చేసింది. గత సంవత్సరం మేలో దక్షిణ కొరియన్ సంస్థలైన ఎస్కె టెలికం, టియు మీడియాలు సంయుక్తంగా మొబైల్ పే టీవీని లాంచ్ చేశారు. ప్రస్తుతం నోకియా ప్రవేశపెట్టిన డిజిటల్ వీడియో (డివిబి-హెచ్) బ్రాడ్‌కాస్టింగ్ ఫర్ హాండ్‌హెల్డ్ యూరోపియన్ మార్కెట్లోకి ప్రవేశించింది.' ఈ డివిబి-హెచ్‌కు కొరియన్‌ల డిఎంబి (డిజిటల్ మల్టీమీడియా బ్రాడ్‌కాస్టింగ్) నుంచి గట్టి పోటీ ఎదురు కానుంది. డిజిటల్ ఆడియో బ్రాడ్‌కాస్టింగ్‌పై ఆధారపడి డిఎంబి పనిచేస్తుంది. ఇది దృశ్యాలను, డేటాను



ఆడియోతో సహా ప్రసారం చేస్తుంది. ఫలితంగా యూరోపియన్లకు, కొరియన్లకు మధ్య రోజురోజుకీ పోటీ పెరిగి పోతోంది. సో టీవీ వర్సెస్ మొబైల్ టీవీ.

పానసానిక్ కె.హెచ్-టి.హెచ్102-ఎం. సిస్టమ్ (దీని వెల 349 డాలర్లు) లో ఆన్సరింగ్ మెషిన్‌తోబాటు టూ లైన్ బేస్ వుంది. ఇక వీడియో కెమెరా, వీడియో ఫోన్ మొదలైన సౌకర్యాల సంగతి సరేసరి. ఫోన్‌బుక్స్, రింగ్ టోన్స్, సంగీతం, ఫొటోలు లాంటి అవసరమైనవాటిని పి.సి.నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వీలు అనేక సెల్‌ఫోన్లలో సర్వసాధారణంగా వున్న ఫీచర్. ఇక హోమ్ కమ్యూనికేషన్ సిస్టమ్స్‌కి అటు మోటొరోలా, ఇటు పానసానిక్ రెండు కంపెనీలూ కూడా కృషిచేస్తున్నాయి. ఇప్పుడు మోటరోలావారి లేటెస్ట్ మొబైల్ ఎస్.డి. 4500లో (అందులో వున్న ఫీచర్స్‌నిబట్టి దీని వెల 80 నుండి 100 డాలర్లవరకూ వుంది) కార్డ్‌లెస్‌ఫోన్‌తో బాటు ఆన్సరింగ్ మెషిన్ వున్న బేస్ కూడా వుంది. వీడియో వంటి అదనపు సౌకర్యాలు కావాలనుకుంటే మరింత మూల్యం చెల్లించాల్సివుంటుంది.

టీవీ కొనాలా? మొబైల్ టీవీ కొనాలా? కొద్దిరోజుల్లో ఈ ఆలోచన అందరినీ వేధించబోతోంది. మొబైల్ అవసరాలతో సహా టీవీ సదుపాయాలు వెన్నంటి ఉండే అవకాశాలు దూసుకొస్తున్న ఈ తరుణంలో నిర్ణయం తీసుకోవడమెవరికీ అంత పెద్ద సమస్య కాదేమో. కానీ లాభనష్టాలు బేరీజు వేసుకోవాలికదా. డిజిటల్ టీవీ అయితే యాంటెనా, పవర్‌సప్లై తప్పనిసరి. అర్జంటు పనివల్ల బయటికెళ్లాల్సినప్పుడు, విద్యుత్ సరఫరా ఆగిపోయినప్పుడు టీవీ కార్యక్రమాలను చూసే అవకాశాన్ని కోల్పోతాం. మొబైల్ టీవీ ఉన్నట్లయితే దీనికి ఆస్కారముండదుగా. అంటే... మొబైల్ టీవీనే బెటరన్నమాట. ఎక్కడికెళ్లినా ప్రొగ్రాం మిస్సవం. కలర్ మానిటర్... కెమెరా ఫోన్... ఇలా రోజులు గడుస్తుంటే లేటెస్ట్ వెర్షన్లు, సరికొత్త టెక్నాలజీ మనకి అందుబాటులోకొస్తూ, మనసులను దోచుకుంటోంది కదూ. మరి మొబైల్‌ఫోన్ వీటన్నింటిలోకెల్లా ఇంకో అడుగు ముందుకేసిందని చెప్పొచ్చు.

"మొబైల్ టీవీ... లేటెస్ట్ టెక్నాలజీతో సౌకర్యవంతంగానూ ఉంది. టీవీ చూడాలంటే ఇంట్లోనే ఉండాలి అన్న బాధలేదు. ఫలితంగా సమయమూ వృథా కాదు. కానీ చెల్లించాల్సిన మూల్యమూ ఎక్కువే. 45 నిముషాలు చూశానోలేదో 50 రూపాయలు ఖర్చు చేయాల్సొచ్చింది" అంటాడో మొబైల్‌టీవీ యూజర్. కొన్ని సందర్భాల్లో ఈ మొబైల్ టీవీ షట్‌డౌన్ అయ్యే అవకాశాలున్నాయట. ఇంకొక విషయమేంటంటే మొబైల్ ఫోన్‌ను బాక్ ఛానెల్‌గానూ ఉపయోగించుకోవచ్చు. అంటే ఓటింగ్, ఇతర వెబ్‌సైట్లకు లింక్ చేయొచ్చు. నచ్చిన ఛానెల్‌ను ఎంచుకోవచ్చు. మరి బ్యాటరీ సంగతో... ఇది ఆలోచించాల్సిన విషయమే. దాని జీవితకాలం మనం మొబైల్‌టీవీని ఉపయోగించేదాన్ని బట్టే ఆధారపడి ఉంటుంది. మరి బ్యాటరీని అభివృద్ధిపరిచే అవకాశాలున్నాయా? ఈ ప్రశ్నలు వినియోగదారులను ఆయోమయంలో పడేస్తాయి. ఏదేమైనా... 'ఈ కార్యక్రమాలు చూడడానికి ఎంత ఛార్జ్ చేసినా భరించడానికి మేం రెడీ...' అని కొందరు హైటెక్ క్రీడాభిమానులు ఉత్సాహ పడుతున్నప్పటికీ, సాధారణ వినియోగదారుడు మాత్రం పునరాలోచించక తప్పేట్లు లేదు మరి.

"మొబైల్ ఫోన్ అనేది పర్సనల్. మనకే సొంతం. ఈ ఛానల్ చూడొద్దు, ఆ ఛానెల్ మార్చొద్దు అని ఆంక్షలు విధించే అవకాశమెవరికీ ఉండదు. అంటే... ఇష్టమొచ్చిన ఛానల్ ఎంతసేపైనా చూడొచ్చు" అంటున్న ఈ అబ్బాయి అంతరంగాన్ని విన్న తర్వాత... ఏదేమైనా ఇది కొంచెం ఆలోచించాల్సిన విషయమే అనిపిస్తోంది కదూ. చాలారోజుల క్రితం చదివిన అశ్లీల చిత్రాల మెసేజ్‌లు గుర్తొస్తున్నాయా? ఏదేమైనా అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆహ్వానించడం మనందరి వంతు. అయితే దాన్ని సరిగా వినియోగించాల్సిన భారమూ మనపైనే ఉందన్న విషయాన్ని గుర్తుంచుకోవాల్సిన బాధ్యతా మనదే.

ఎంత దూరానున్నవారితోనైనా పక్కనున్నట్లే మాట్లాడుకునే టెలిఫోన్ని కనిపెట్టిన గ్రాహంబెల్‌ని ఎంత మెచ్చుకున్నా తక్కువే. ఫిక్స్‌డ్‌లైన్ సంగతలా వుంచి మొబైల్స్ వచ్చాయి. మొబైల్ అంటే మొదట్లో ఎక్కడికెళ్ళినా వెంటబెట్టుకెళ్ళగల్గడం ఒక్కటే ప్రయోజనం అన్నట్లుండేది. కానీ ఇప్పుడలా కాదు, అదో మాయాప్రపంచంలా తయారైంది. క్రమేపీ మొబైల్స్ లేకుంటే జీవితం స్థంభిస్తుందేమోనన్నంతగా వుంది వీటి వాడకం. కారణం ఇందులో ఎన్నో సౌకర్యాలుండటమే.

డ్రైవ్‌చేస్తూ ఫోన్లో మాట్లాడ్డంవల్ల ప్రమాదాలు జరిగే అవకాశముంది కనుక అలా మాట్లాడకూడదని ఆంక్ష విధించింది ప్రభుత్వం. అయితే దాన్నెంతమంది లక్ష్యపెడుతున్నారనేది ఆలోచించాల్సిన సంగతే. ఇకపై హ్యాండ్‌సెట్‌లో టీవీచూస్తూ స్పీకర్లో బాతాఖానీ సాగించొచ్చు. అయితే సెల్‌ఫోన్‌వల్ల రేడియేషన్ ఎక్కువని, ముందుగా చెవులు ఆనక మెదడుపై దీని ప్రభావముంటుందని మనకు తెలిసిందే. పైగా పోర్టబుల్ డి.వి.డి. ప్లేయర్... ప్రయాణాల్లో వాటిపై దృష్టి నిలిపి ప్రమాదాలే సృష్టిస్తారో లేక అవసరానికే చూస్తూ అప్రమత్తంగా వుంటూ టెక్నాలజీని సద్వినియోగం చేసుకుంటారో వేచిచూడాల్సిందే. ఏదేమైనా రానున్న అరచేతిలో అద్భుతానికి ఆహ్వానం పలుకుతోన్నవారి సంఖ్య మాత్రం అధికంగానే వుంది.

*

చిరంజీవి నారాయణన్

వేదగిరి రాంబాబు

ఈ ఫొటోలో వున్న కుర్రాణ్ణి చూశారుగా... పేరు స్వామినారాయణన్. వయసు పదిహేడేళ్ళు. చెన్నైలో ఎస్.ఆర్.ఆర్. కాలేజీలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులకు సికింద్రాబాద్‌లో వున్న తల్లిదండ్రులతో గడుపుదామని వచ్చాడు. జనవరి 13న అతని పుట్టినరోజు. ఆ అబ్బాయి చెల్లెలు కూడా అదేరోజున పుట్టింది. అందుకే స్వామి నారాయణన్ ఎప్పుడూ కూడా బర్త్‌డేని మిత్రులతో కాకుండా ఇంట్లోవాళ్ళతో సరదాగా గడుపుతుంటాడు. ఆ పుట్టినరోజప్పుడు తండ్రి రఘురామ్‌గారు ఊళ్ళోలేరు. ఉద్యోగం పనిమీద పూనే వెళ్ళారు. తల్లి లలితారఘురామ్



స్వామి నారాయణన్

తన తండ్రి గుండెనొప్పితో ఆసుపత్రిపాలవడంతో అక్కడికెళ్ళారు.

దాంతో నారాయణన్ మిత్రులతో సరదాగా బయటకు వెళ్ళాడు. అందరూ కలసి కారులో నాగార్జునసాగర్ బయల్దేరారు. ఆరోజు బాగా ఆలశ్యమవడంతో అతను ఇంటికి ఫోన్‌చేసి "ఈ రాత్రికి రావడంలేదు. మేమిక్కడే ఫామ్‌లో వుంటున్నాం. ఉదయాన్నే బయల్దేరి వస్తాం. అవసరమైతే నాకు ఫోన్ చేయండి" అంటూ తల్లికి స్నేహితుడి సెల్ నంబరిచ్చాడు.

అప్పటికి రాత్రి పన్నెండైంది. నారాయణన్, అతని మిత్రులూ ప్రయాణిస్తోన్న కారు దూసుకెళ్తోంది. ఎదురుగా వచ్చే వాహనపు కాంతి కళ్ళలో పడడంతో కారును కొంచెం పక్కకు తిప్పాడు.

అంతే... అది ఒక గుంటలో పడిపోయింది. ఆ సమయంలో అటుగా ఎవరూ రాకపోవడంతో నాలుగ్గంటలపాటు వాళ్ళా గోతిలోనే వుండిపోయారు. పొద్దున్నే వస్తోన్న మిల్క్‌వాన్‌వాళ్ళు వీళ్ళని గమనించారు. గోతిలోపడ్డ ఇద్దరు పిల్లలకు బాగా గాయాలయ్యాయి. మిగతా ఇద్దరు పిల్లలకు ప్రాణాపాయంలేదు.

వాళ్ళని కామినేని ఆసుపత్రికి తరలించారు. అప్పుడు ఫోన్ నంబరు తీసుకుని ఎవరో నారాయణన్ ఇంటికి ఫోన్‌చేశారు. కొడుకుకోసం ఎదురుచూస్తోన్న తల్లిదండ్రులు ఫోన్ మోగగానే ఎత్తారు.

"ఇబ్రహీంపట్నం రోడ్లో కారుకు యాక్సిడెంట్ అయింది. అందులో వున్న నలుగురిని కామినేని హాస్పిటల్లో చేరుస్తున్నాం" అని చెప్పి పెట్టేశారు.

తల్లిదండ్రులు వాయువేగంతో ఆసుపత్రికి వెళ్ళారు. పిల్లవాడిని అలా వెంటిలేటర్‌మీద చూసేసరికి తట్టుకోలేకపోయారు.

"మీవాడి బ్రెయిన్ బాగా

స్వామి నారాయణన్ కుటుంబం

దెబ్బతింది" అన్నారు వైద్యులు ఒక్కసారిగా చెప్తే వాళ్ళు మరీ బెంబేలుపడ్తారని. కొద్దిసేపయ్యాక "పేషెంట్‌కి బ్రెయిన్‌డెత్ జరిగింద"ని చెప్పారు.

తల్లిదండ్రులిద్దరూ ఓ స్వచ్ఛందసంస్థలో పనిచేస్తున్నారు. అవయవదానాల ప్రాముఖ్యాన్ని చెప్పి బ్రెయిన్‌డెత్ అయినవాళ్ళ అవయవాలను దానం చేసేట్టు చూసి, మరికొందరు వాటిద్వారా ఆరోగ్యాన్ని పొందేట్టు చూడటం ఆ స్వచ్ఛందసంస్థ ప్రధానోద్దేశం.

దాంతో వాళ్ళిద్దరికీ తమ కుమారుడి పరిస్థితి అర్థమైంది. బ్రెయిన్ డెత్ అయిందంటే తమ కొడుకు బ్రతికేది అతికొద్ది సమయమే.

భార్యాభర్తలిద్దరే కాకుండా మిగతా కుటుంబసభ్యులతో కూడా చర్చించి నారాయణన్ అవయవాల్ని డొనేట్ చేయాలని నిశ్చయించుకున్నారు. ఎక్కువసేపు ఆలోచనలతో గడిపే అవకాశం కూడా లేదు. అంత కష్టంలోనూ లివర్, రెండు మూత్రపిండాలు, రెండు కార్నియాలను దానంచేసి అయిదారుగురికి కొత్త జీవితాన్నిచ్చారు ఆ అబ్బాయి అమ్మానాన్నలు. "ఎంతోమంది బ్రెయిన్‌డెత్ పేషెంట్లకి 'అర్గాన్ వ్యర్థం చేయొద్దు.. దానం చేయమని' కౌన్సిలింగ్ ఇచ్చాం. అందువల్లే మావాడు బ్రెయిన్ డెత్‌కు గురయ్యాడని వినగానే మాకా ఆలోచన వచ్చింది" అన్నారు రఘురామ్. "నాకే ఇలా జరుగుతుందని నేనెప్పుడూ అనుకోలేదు. కానీ జరిగింది. తప్పదు. నిజాన్ని స్వీకరించాలి. ఊహించనివి జరగడమే కదా జీవితం. గతంలో ఇలాంటి పరిస్థితుల్లో వున్న ఎందరినో ఓదార్చి, ధైర్యం చెప్పిన నేను, ఈసారి నన్ను నేనే ఓదార్చుకున్నాను. మా అబ్బాయి అవయవదానానికి నిశ్చయించుకున్నాను" అన్నారు లలితారఘురామ్.

అల్లారుముద్దుగా పెంచుకున్న ఏకైక కొడుకు చనిపోతే, ఆ దంపతులు కష్టాన్ని దిగమింగి ధైర్యంగా తమ కుమారుడి అవయవాల్ని దానం చేశారు. వీళ్ళు చేసిన ఈ అమూల్యదానం ఐదుగురికి జీవితాన్నిచ్చి ఆనందాన్ని పంచింది.

'మనం చెప్పేది చేయాలి, చేసేది చెప్పాలి' అన్నట్లు చెప్తున్న విషయాన్ని ఆచరణలో పెట్టిన ఈ దంపతుల్ని నిజంగా ఆదర్శదంపతులు అనాలి కదూ?! *

కథ

ఉల్లి చేయును మేలు

వెంకట సుబ్బారావు కావూరి

కనకారావుకి బోలెడు కష్టం వచ్చిపడింది. వెయ్యి రూపాయల కట్టలతో తూకం వేసినా పరిష్కారం కన్పించటం లేదు. అంటే మూడు వందలు పలుకుతోన్న ఓటుకి పెళపెళలాడుతున్న వెయ్యి రూపాయల నోటు పంచినా మున్సిపల్ ఎన్నికల్లో గెలుస్తానన్న నమ్మకం కనకారావుకి కలగటం లేదు.

నా చేతను, నీ చేతను వరమడిగిన కుంతి చేతను అంటూ కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలను నల్లనయ్య విశ్లేషించినట్లుగా కనకారావుకి ఓటర్ల మద్దతు దొరక్క పోవటం వెనుక కూడా అన్నన్ని కారణాలు కన్పిస్తున్నాయి. ఏ మాటకామాట చెప్పుకోవాలి. ఈ సవాలక్ష కారణాలూ కలగలిసి భవిష్యత్తు ఎన్నికల్లో తనను ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల మున్సిపాలిటీ మురుగు తాగిస్తాయన్న ఇంగితం గత ఐదేళ్లూ కౌన్సిలరుగా వెలగబెట్టిన కాలంలో కనకారావుకి లేకుండా పోయింది.

'ధనమొచ్చిన మదమెక్కును...మదమెక్కిన పదవొచ్చును' అంటూ తన చిన్నప్పుడు పక్కింటి చిన్నారావు పాడే పాట కనకారావుకి ఇప్పుడు క్షణం క్షణం గుర్తుకొస్తోంది. 'వెధవలకు పదవులు' అంటూ నాయకుల్ని తెగనాడే తన హైస్కూలు తెలుగు మాస్టారి తిట్ల పురాణం కనకారావు మదిని తిట్టి తట్టింది.

కనకారావు వాటన్నింటినీ బలవంతంగా మనసు నుంచి తోసి పారేశాడు. తన సమస్య తప్ప మరొకదాన్ని గురించి ఆలోచించ లేకపోతున్నాడు.

తాను కనీసం ఒక్క ఓటుతోనయినా ఈసారీ బయటపడాలి. కౌన్సిలరుగా గెలిస్తే ఆ

తరువాత ఏదో ఒక రకంగా ఏకంగా మున్సిపల్ ఛైర్మను అయిపోవచ్చు. అదంత కష్టం కాదు తనకు. తన వార్డులో ఎలా గెలవాలన్నదే అసలు సమస్య.

తాను చేయబోయే ప్రతి పనికీ ముహూర్తాలు పెట్టే జ్యోతిష్యుడు కనకాంబరాన్ని కనకారావు సంప్రదించాడు. కనకాంబరం మదిలో ఏముందోగానీ ఓడిపోతాడని చెప్పలేదు. అలాగని గెలుస్తాడనీ నమ్మించే ప్రయత్నమూ చేయలేదు. గురుడు సజావుగా సంచరిస్తున్నా శని గ్రహం క్రీనీడ ఛాయామాత్రంగా దానిపై పడుతోందని తేల్చాడు. ఆ కారణంగానే కనకారావుకి గెలుపు దోబూచులాడుతోందని సెలవిచ్చాడు. వెయ్యిన్నొక్క టెంకాయలు, కోటిమల్లెలతో పూజ కానిస్తే శని పీడ వదలుతుందని వివరించాడు. అందుకు శరవేగంగా ఏర్పాట్లు జరిగిపోయాయి. అదే సందర్భంలో రెండువేల పదహారు టెంకాయలతో, రెండు కోట్ల మల్లెలార్చన కార్యక్రమాన్ని తన ప్రత్యర్థి సంగమేశ్వరరావు చేయిస్తున్న సంగతిగానీ, అలా చేయమని కనకాంబరమే చెప్పాడనిగానీ కనకారావుకి తెలియదు.

వారం రోజులు గడిచాయి. అయినా ఓటర్ల తీరు మారలేదు. కనకారావు బాధ తీరలేదు. నాయకులు, కార్యకర్తలు, తన కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు, కుల పెద్దలు ఇలా అందరినీ కదిపాడు కనకారావు. అందరూ చెప్పిందొకటే...చేతికి ఎముక లేకుండా నోట్లు వెదజల్లి ఓట్లు కొనేయమని. నోట్లు వెదజల్లటానికి కనకారావుకి ఇబ్బందేమీ లేదు. కాకపోతే కోటి రూపాయలు అనుకుని దిగిన ఓట్ల కొనుగోలు బడ్జెట్టు మరొక మూడు నాలుగు రెట్లు పెరుగుతుంది. అయినా వాటికీ ప్రస్తుత పరిస్థితుల్లో ఓట్లు రాలతాయని నమ్మకం కలగటం లేదు కనకారావుకి.

కనకారావు డీలా పడిపోయాడు. నెలరోజులపాటు లంకణం చేసినట్లు ఒక్క రోజులోనే ముఖం పీక్కుపోయింది. వెంటనే నీరసం ఆవరించింది. తిన్నది తిన్నట్లు వాంతయిపోయినట్లు డొక్కలు పీక్కుపోయాయి కనకారావుకి.

ఆ సమయంలో పల్లెనుంచి వచ్చాడు కనకారావు మామ కుక్కుటేశ్వరరావు. కనకారావు పరిస్థితి చూశాడు. అతని దుస్థితి చూసి చలించిపోయాడు. ఏదన్నా జరిగితే.... ఆపై ఆలోచించలేకపోయాడు కుక్కుటేశ్వరరావు. తన కూతురి బతుకు బుగ్గిపాలవదూ? ఎన్నికలకు ఇక మూడు రోజులే గడువుంది. ఏదో ఒకటి చేయాలనుకున్నాడు.

సుదీర్ఘంగా ఆలోచిస్తున్నాడు కుక్కుటేశ్వరావు. ఆయన కుమార్తె లోపలికి పోతోతూ దగ్గరకొచ్చింది. 'చూడు నాన్నా, ఎట్టాంటి కాలమొచ్చిందో, ఉల్లిపాయలు కిలో పాతిక రూపాయలంట. అదీ ఒక్క పాయా సక్రమంగా లేదు' అంటూ వాటిని తండ్రికి చూపించింది. అంతే కుక్కుటేశ్వరరావు మదిలో అల్లుడి సమస్యకు తళుక్కుమంది పరిష్కారం. ఒక నిర్ణయానికి వచ్చాడు. లేచాడు. కర్నాటక, కర్నూలు ఇంకెక్కడెక్కడికో, ఎవరెవరికో ఫోన్లు చేశాడు. ఆఘమేఘాల మీద పని కావాలని కోరాడు. ఆ తర్వాత ప్రశాంతంగా ఒక్కొక్క పనీ కానిచ్చాడు. ముందుగా వీధివీధిలో ఏర్పాటు చేసిన ఎన్నికల కార్యాలయాలను ఖాళీ చేయించాడు. ఆర్టిస్టులను పిలిపించి బ్యానర్లు రాయించాడు. అసలు ఉందో లేదో తెలియని వాలేశ్వరావు ట్రస్టు పేరిట బ్యానర్లు తయారయ్యాయి. వాలేశ్వరావు ఐదో జయంతి సందర్భంగా ఉచితంగా ఉల్లిపాయల పంపిణీ జరుగుతుందని బ్యానర్లలో రాయించాడు.. ఓట్ల కోసం ఉల్లిపాయలు పంచుతున్నాడని ప్రత్యర్థులు ఫిర్యాదు చేయకుండా, చేసినా ఎన్నికల సంఘానికి ఎక్కడా దొరక్కుండా ఈ ఏర్పాట్లు చేశాడు కుక్కుటేశ్వరరావు ఉరఫ్ శకుని.



తెల్లవారింది. కనకారావు నిన్నటివరకూ ఎన్నికల కార్యాలయాల్ని నిర్వహించిన ఇళ్ల ముందు జనం వందలాదిగా బారులు దీరారు. చాటుగా ఓటరు గుర్తింపు కార్డు చూపించి మనిషికి ఐదేసి కిలోల చొప్పున ఉల్లిపాయల సంచుల్ని తీసుకుపోతున్నారు. 'గెలిచినాక మీరేం చేస్తారో మాకనవసరం. ఉల్లిపాయలు కిలో ఐదు రూపాయలకు దొరికేదాకా ఉచిత పంపిణీ పథకం ఆపేశారో... ఇక జన్మలో మీ ముఖం చూడం' అంటూ తిట్లూ, దీవెనల్ని కలిపి చెబుతూ ఓటర్లు నవ్వుతూ వెళ్ళిపోతున్నారు.

ఎన్నికల రోజు రానే వచ్చింది. తోపుడు బళ్ల వ్యాపారుల అవతారం ఎత్తిన కనకారావు సిబ్బంది నుంచి పదేసి కిలోల చొప్పున ఉల్లిపాయల్ని మళ్లీ అందుకున్నారు ఆ వార్డు ఓటర్లు. మూడోనాడు జరిగిన ఓట్ల లెక్కింపులో కనకారావుకి భారీ మెజార్టీ దక్కింది.

రాజ్యసభ సభ్యుడు దండూనాయక్, ఎమ్మెల్యే చిత్తరంజన్, ఎంపీ వరదానాయుడు ఓట్లు కలగలిసి కనకారావు మున్సిపల్ ఛైర్మన్‌గా కూడా ఎన్నికయ్యాడు.

వారం గడిచింది. ఊరేగింపులు, సన్మానాలు పూర్తయ్యాయి. కాసింత తీరిక దొరికింది. అప్పటిదాకా ఉగ్గబట్టి ఇక ఉండలేక తన మామను పిలిచాడు కనకారావు. కుక్కుటేశ్వరరావు వచ్చాడు అల్లుడి గదిలోకి. "ఉల్లిపాయల పథకాన్ని ఐదేళ్లూ నడిపితే ఎంత ఖర్చవుతరుందో లెక్కలేశావా మావా?" అనడిగాడు.

"అల్లుడూ, అన్ని లెక్కలూ తెలుసయ్యా" అని నవ్వి, తిరిగి "నువ్వు గెలవటానికి ఈ సమయంలో ఉల్లిపాయలు తప్ప మరొకటి నాకు కనపడలేదు. అయినా ఐదేళ్లూ జనానికి ఉల్లిపాయల్ని ఉచితంగా పంచి నా కూతుర్ని బిచ్చగత్తెను చేయటానికి నేనేమన్నా వెర్రివెంగళప్పనంటయ్యా?" అంటూ ఎదురు ప్రశ్నించాడు కుక్కుటేశ్వరరావు.

మామ ఏం చెబుతాడోనని నోరు తెరుచుకుని వింటున్నాడు కనకారావు. తన పథకాన్ని మూడో చెవిన పడకుండా గుసగుసగా విన్పించాడు అల్లుడికి. ఇంకా ఒకటి రెండుసార్లు పంచుతాం అల్లుడూ. ఆ తర్వాతెటూ ఉల్లిపాయల ధర కిలో నాలుక్కో ఐదుకో పడిపోతుంది, అప్పుడు సగం మంది మనమిచ్చే ఉల్లిపాయలకోసం ఎటూ రారు. అప్పటికీ వచ్చేవాళ్ళకోసమంటావా? ఏ పావలాకో, అర్థకో దొరికే ఉల్లిపాయల్ని ఎన్నిచ్చినా మనకు పోయేదెంత? అయినా ఇప్పట్లాగా ఇస్తామా? మనమిచ్చే ఉల్లిపాయల్ని తీసుకోగూడదని పారిపోయేటట్లు చేయనూ? మొదట చౌకదుకాణాలోళ్లు తిప్పినట్లు రేపుమాపు అంటాం. అనక ఇప్పుడు రైతు బజార్లలో అమ్ముతున్నారు చూడు అలాంటి కుళ్లిపోయిన వాటిని పంచుతాం. ఆ దెబ్బకు వాళ్లంతట వాళ్లే మానుకోకపోతే అప్పుడడుగు. కుళ్లి కంపుకొట్టే ఉల్లిపాయల్ని ఊరకిచ్చినా ఎవరయ్యా తీసుకుపోయి ఇంట్లో పెట్టుకుని తినేది? సుదీర్ఘంగా తన పథకాన్ని వివరించి ఛైర్మన్ ఏసి ఛాంబరు నుంచి బయటకు వచ్చాడు కుక్కుటేశ్వరరావు.

*

సెన్సు కామన్ సెన్సు

మొలకలపల్లి కోటేశ్వరరావు

పెద్దలూ... మీరే ఆదర్శం!

"మా వాడికి మార్కులు బాగా తగ్గిపోతున్నాయి టీచర్. ఇలాగయితే ఎలా?" అంటూ దురుసుగా వచ్చింది లక్ష్మి.

"ముందు మీరు ప్రశాంతంగా ఈ కుర్చీలో కూర్చోండి. నెమ్మదిగా మాట్లాడుకుందాం" ఒక విద్యార్థితో మాట్లాడుతున్న క్రాంతి టీచర్ వీలైనంత సౌమ్యంగా, శాంతంగా అంది.

"అది కాదు టీచర్..."

"ప్లీజ్... ముందు కూర్చోండి. మాట్లాడదామంటున్నా కదా?"

లక్ష్మి మరో మాట మాట్లాడకుండా కూర్చుంది.

ఆ విద్యార్థిని పంపించి, మరో అబ్బాయిని పిలిచి ఏదో పని చెప్పి, తర్వాత నెమ్మదిగా లక్ష్మివైపు తిరిగి అడిగింది "మీ సమస్యేంటి?"

"మా వాడికి మార్కులు బాగా తగ్గిపోయాయి మేడం. ఫస్ట్ యూనిట్‌లో నైన్టీటూ పర్సెంటు వస్తే, సెకండ్ టెస్ట్‌లో ఎయిటీ ఎయిట్... ఇప్పుడు ఎయిటీ టు పర్సెంటే వచ్చింది మేడం. రెండో ర్యాంక్‌నుంచి ఐదో ర్యాంకుకు పడిపోయాడు. వీళ్ల నాన్నగారేమో కోప్పడుతున్నారు"

లక్ష్మి కొడుకు కార్తీక్. ఏడవతరగతి చదువుతున్నాడు.

"మార్కులూ, ర్యాంకులూ ఎందుకు తగ్గిపోతున్నాయంటారు?" క్రాంతి అడిగింది.

"మాకేం తెలుసు టీచర్? అది మీరే చెప్పాలి"

"మేం మాత్రం ఏం చెప్పగలం? కారణం మీకే తెలియాలి" అని కార్తీక్‌ను రూంలోనికి పిలిపించింది క్రాంతి టీచర్.

"చూడు కార్తీక్... ఈమధ్య నీకు మార్కులు బాగా తగ్గిపోతున్నాయంటోంది మీ మదర్. అది నిజం కూడా. చదువులో నువ్వెందుకు వెనుకబడిపోతున్నావు? మార్కులెందుకు తగ్గిపోతున్నాయి?"

కార్తీక్ నేలచూపులు చూడడం తప్ప సమాధానం చెప్పలేదు. రెట్టించి అడిగింది క్రాంతి.

"ఈసారినుంచి బాగా చదువుతాను మేడం. వచ్చే పరీక్షల్లో రెండో ర్యాంకు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తాను"

"ఒకే... గట్టిగా చదువు. చదువులో వెనుకబడితే ఇక అంతే. వెనకనే ఉంటారు" అని క్రాంతి అతన్ని క్లాస్‌రూంలోనించి పంపించేసింది. లక్ష్మిని ప్రశ్నించింది.

"ఈసారినుంచి చదువుతానని చెప్పాడు కదా. చూద్దాం"

"పోయినసారి కూడా ఇదేమాట చెప్పాడు మేడం! అసలు ఇంటికిరావడమే ఆలస్యం, టీవీకి అతుక్కుపోతాడు. టీవీ చూడొద్దని చెప్పీ చెప్పీ మాకు వినుగువుట్టింది. మీరైనా చెప్పండి"

"మీరూ టీవీ చూస్తుంటారా?"

"నేను హౌస్ వైఫ్‌ను. నాకు వేరే పని ఉండదు. సీరియళ్లూ, సినిమాలూ అంటే నాకు ఇష్టం"

"మీ వారూ..."

"ఆయన క్రికెట్టు వీరాభిమాని, టెస్టు ఉందంటే ఆఫీసుకు లీవ్ పెట్టి టీవీముందు సెటిలైపోతారు. టిఫిన్లూ, భోజనాలూ చివరికి పవళింపు... అన్నీ అక్కడే" నవ్వుతూ అదో గొప్ప విషయమన్నట్లుగా చెప్పింది లక్ష్మి.

"మీరు చూడొచ్చుకానీ, మీ పిల్లవాడు చూడకూడదంటారు. అంతేనా?"

"మేం పెద్దవాళ్లం. మాకూ పిల్లలకూ తేడా లేదూ?"

"తేడా ఏమిటి?"

లక్ష్మి ఏమీ జవాబు చెప్పలేకపోయింది.

"పెద్దవాళ్లకు మీకే టీవీల మీదా, క్రికెట్టులమీద అంత ఆసక్తి, వ్యామోహం, వెర్రితనం ఉంటే ఏమీ తెలియని పిల్లలకు ఇంకెంతుంటుంది? మీ పిల్లవాడికి మార్కులు తగ్గిపోతున్నాయని మమ్మల్ని ప్రశ్నించడం కాదు. మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. ఎందుకు తగ్గిపోతున్నాయో తెలుస్తుంది"

"అది కాదు మేడం..."

"ఏది కాదు? పిల్లలకు చూడొద్దని చెప్పడం కాదు. ముందు మీరు చూడకుండా ఉండండి. "మేం పెద్దవాళ్లం చూస్తాంగానీ, మీరు పిల్లలు చూడకూడదు"అని చెప్పడం ఏం న్యాయం, ఎక్కడి న్యాయం? పిల్లలమీద తల్లిదండ్రుల ప్రభావం ఎంతో ఉంటుంది. పెద్దవాళ్లను వాళ్లు అనుకరిస్తారు. వాళ్లను చూసి నేర్చుకుంటారు. దాదాపు వాళ్లదారిలోనే నడుస్తారు. అలాంటప్పుడు పెద్దవాళ్లు పిల్లలకు ఆదర్శవంతంగా ఉండాలి. పిల్లలకు పెద్ద వాళ్లే రోల్‌మోడల్స్. టీవీ చూడడంవల్ల మీకు మాత్రం ఏం సుఖం? సమయం వృథా తప్ప ఆ టీవీలు చూసి నేర్చుకునేది ఏమైనా ఉంటుందా మీరే చెప్పండి?!"

అందుకేం జవాబు చెప్పాలో తెలియక తలొంచుకుంది లక్ష్మి.

"మీ పిల్లవాడికి మార్కులు రావాలంటే ముందు మీరు టీవీ చూడడం మానేయండి. అప్పుడు వాడి మార్కులు చూసి మీరే ఆశ్చర్యపోతారు. లోపం మీలో పెట్టుకుని పిల్లవాణ్ణి నిందించి ఏం ప్రయోజనం?"

"మీరన్నదాంట్లో నిజముంది. అబ్బాయికోసమైనా నేను టీవీ చూడ్డం మానేస్తాను. ఆయన్తో మాట్లాడి ఒప్పించి అసలు కేబుల్ కనెక్షనే తీయిస్తాను మేడం" అంటూ లేచి ఇంటిదారి పట్టింది లక్ష్మి.

*



తెలంగాణా కతకు తొంభై ఏళ్లు

(తెలంగాణా కథలు, సంపాదకులు: కాలువ మల్లయ్య, సదానంద శారద, చంద్ర, ప్రచురణ: విశాలాంధ్ర, పేజీలు: 810, వెల: 300/-, ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు)

స్నేహ

ఓ ప్రాంత సజీవచరిత్రకు పటంకట్టి ఎన్ని తరాలకైనా చూపిద్దామని గోడమేకుకి వేలాడదీశారు ముగ్గురు తెలంగాణా కథలరాయుళ్లు. విశాలాంధ్రవారు ప్రచురించిన 'తెలంగాణా కథలు' (తొమ్మిది దశాబ్దాల సాంస్కృతిక పోరాటరేఖలు) ఓ మంచి కథా సంకలనం.

తొంభై ఏళ్ల కథా తెలంగాణా మాగాణి తొంభై ఎకరాలమేర పరచగలిగినంత చరిత్ర కలది. ఘనమైన కథా కొండను అద్దంలో చూపినంత సులువుగా తొంభై కథల సంకలనంగా మనచేతుల్లో వుంది. తెలంగాణా నైజాం ఫ్యూడల్ ప్రభువు చేతిలో ఉన్న నాటి 'నీ బాంచెన్దొరా...నీ కాల్మొక్తా' వంటి సామాజిక పరిస్థితుల మధ్య మొట్టమొదటి కథ అనదగ్గ మాడపాటి హనుమంతరావుగారి 'ఎవరికి?' కథ నుండి ప్రపంచీకరణా పడమటి పెనుగాలుల విలయాల నేటి స్థితిగతుల్లో బెజ్జారపు రవీందర్ 'నిత్యగాయాల నది' కథ వరకూ తొంభై కథలను 809 పేజీలపై కొలువుదీర్చారు. సంగిశెట్టి శ్రీనివాస్గారి దస్త్రమ్లోని తెలగాణా కథల జాబితా, ఇప్పుడీ కథాసంకలనం సాహిత్యపరిశోధకులకు ఓ మంచి రిఫరెన్సు. వాస్తవానికి వెయ్యికి పై చిలుకు కథలుండవచ్చని ప్రచురణకర్తలే అంటున్నారు. అందులోంచి 1912 నుండి 2004వ సంవత్సరాల మధ్యకాలంలోని తొంభై కథలను తొంభై ఏళ్ళ చరిత్రకు ప్రతీకగా ఈ సంకలనాన్ని కూర్చారు. ఈ సంకలనంలో ప్రచురణకర్తలు అన్నట్లు, విజ్ఞప్తులపర్వం నుండి విప్లవాలయుగం దాకా కథాగమనం సాగింది. ఈ తొంభై కథలూ మూడు దశల తెలంగాణాకు అద్దంపట్టాయి. నిజాం నవాబు, దేశ్ముఖ్, పటేల్, పట్వారీ, రజాకర్ల అణచివేతల కాల నేపథ్యంలో వచ్చిన కతలు మొదటి దశ కథలు, ఓపెన్ పెనుగులాటగా వ్యక్తమై దేశ విప్లవానికే దిక్సూచిలా సాగిన తెలంగాణా పోరాటకాలంలో వచ్చిన కథలు రెండో దశ కథలు, ఇక మూడో దశకు చెందిన కథలు పోరాట విరమణ, సైనిక చర్య, భారతదేశంలో నైజాం సంస్థాన విలీనం నుంచి నేటి ప్రపంచీకరణ దుస్థితుల వరకూ ప్రతిబింబమైన కథలని చెప్పవచ్చు.

సహజంగానే పోరాటం లేదా సంఘటన జరుగుతూన్న కాలంతో సరిసమానంగా సాహిత్యం వెలువడ్డం అంటే అది కచ్చితంగా పాట రూపంలో మాత్రమే సాధ్యం. కథగా రూపుదాల్చాలంటే ఏటుకూరి ప్రసాద్గారు ముందుమాటలో అన్నట్లు ఆవేశం నెమ్మళించి ఆలోచనలు కొనసాగినప్పుడే కథాప్రక్రియ రూపుదిద్దుకుంటుంది. తెలంగాణాగడ్డకే తొలికథ అనదగిన 'ఎవరికి?' కథలో వర్ణితమైన పరిసరాలు, పరిస్థితులను, వ్యక్తులమధ్య, సమూహాల మధ్య సంబంధాలను ఒక పరిశీలనాదృష్టితో చదివితే ఆనాటి జమీందారుల వర్గస్వభావం, గ్రామీణుల పరిస్థితి, మోహనరావులాంటి నిజాయితీపరులైనవారు జమిందారు దగ్గర కొలువున్నా తమ నిజాయితీని నిలబెట్టుకునే ప్రయత్నం అర్థం అవుతుంది. ఆనాటి కథారచయితల పరికల్పనలో సదుద్దేశాన్ని సహృదయంగానే అర్థం చేసుకోవాలి. జమీందారు ప్రతాప్వర్మ లాంటివారు నిజంగానే మంచివారైపోతారా? అలా రాయడం అవాస్తవం కాదా అని అనుకోకుండా రచయితే పాత్రకు కొన్ని పరిస్థితులు కల్పించి, చివరకు మోహనరావులాంటి వారి నిజాయితీ తనకెంతవసరమో గుర్తించి వగచినట్లుగా రచన చేశారు. ఆ రచనాకాలానికి అభ్యుదయ దృక్పథం స్థాయి అంతవరకే.

పోలీస్ యాక్షన్ మొదలైన మూడవనాటి పరిస్థితిని వ్యతిరేక పాత్రలోంచి కూడా ఆనాటి వాస్తవ పరిస్థితులను చాకచక్యంగా రచనాబద్ధం చేశారు నెల్లూరి కేశవస్వామి 'యుగాంతం' కథలో. ఈ కథల్లో చక్కటి కథానిర్మాణమున్న కథ ఇది. కంటికి కనబడే సంఘటనో, వ్యక్తులనో వర్ణించడంతో సరిపెట్టకుండా కంటికి కనబడని సంఘర్షణ, పరిణామాలు, నేపథ్యాలను పాఠకులకు అవగతమయ్యేట్లు చేయడం కథాప్రక్రియ ముఖ్య కర్తవ్యం. దాన్ని ఈ కథ చక్కగా నిర్వహించింది. నిజాం ప్రభువు లొంగిపోతూ జరిగిన దౌర్జన్యాలకూ, మానభంగాలకూ కారణం రజాకార్లమీదకు తోసేశాడు. ఖాసీంరజ్వీ తనదోవ తాను చక్కబెట్టుకున్నాడు. రజ్వీ అనుచరగణంలో ఉన్న దిలావర్ లాంటి వాళ్ళ నిజాయితీ బయటికొచ్చి అంతర్మథనపడతారు. అతను చిన్ననాటి మిత్రుడు స్వామి వద్దకొచ్చి తాను రజాకార్గా దోచిన సొమ్ము, నగలమూట ఇచ్చేసి చెప్పాపెట్టకుండా వెళ్ళిపోతాడు. ఆ నగలమూటనేం చేయాలో తోచక తెలంగాణాపై పోలీస్ చర్యకై వేంచేసిన సైన్యాలతో సివిల్ డ్యూటీకి వచ్చిన తహసిల్దారైన దూరపుబంధువుకి అప్పజెప్పి, స్వామి 'హమ్మయ్య' అనుకుంటాడు. సర్కారు జిల్లాలనుంచి వచ్చిన ఆ తహసిల్దారు మహాశయుడు దాన్ని కైంకర్యం చేశాడని ఆ తర్వాత తెలుస్తుంది. ఈ వృత్తాంతంలో ఎక్కడా రచయిత కనబడడు. పాత్రల చలనం, వాటి ప్రవర్తన, వారి అంతర్గత లక్షణాలు వ్యక్తమయ్యేలాచేయడం ద్వారా ఆమోఘమైన విషయాలను పాఠకులకు చేరవేస్తారు రచయిత. దిలావరూ, స్వామీ మతాలు వేరైనా ఎంత మంచి మిత్రులో ఈ చిన్న కథలో అద్భుతంగా పొదిగిన అంశం. భార్య అత్యాశకు లొంగిన దిలావర్ రజాకార్గా చేయరాని ఘోరాలు చేసి, నగలు, డబ్బు దోచుకుని వస్తే ఆవిడగారు వేరే అధికారితో ఎంచక్కా లేచిపోతుంది. ఆమెకోసం ఇంత దుర్మార్గంచేసి తెచ్చిన డబ్బుతో దిలావర్కి పనిలేదు. కాగా ఆ మూట తన చెంతనుండగా యూనియన్ సైన్యాలకు దొరికితే మరింత ప్రమాదం. లేదా ఏ హిందూలకో, కమ్యూనిస్టులకో దొరికితే మరింత ప్రమాదమని వణికిపోతూ స్నేహితుడు స్వామి ఇంటికి వచ్చాడు. ఆ సొమ్ముని ఏదన్నా మంచి పనికి ఉపయోగించమని ఉత్తరం రాసి వెళ్ళిపోతాడు. ఇలాంటి వ్యక్తిత్వాన్ని దిలావర్ పాత్రకు ఇవ్వడం ద్వారా కొందరు రజాకార్లలోని అంతర్మథనం వర్ణించినట్లయ్యింది. అదే సమయంలో ఆనాటి సంక్లిష్ట సామాజిక స్థితిని రచనారూపంలో నమోదుచేసినట్లయ్యింది. మొత్తంగా ఈ కథ నిజాం నైజాన్ని, రజాకార్ల దురాగతాల్ని పోలీస్ చర్యపేరుతో వచ్చిన అధికారగణాల్లోని మోసకారితనాన్ని ఒకేసారి బట్టబయలు చేసింది. అందుకే ఇలాంటి కథలు చారిత్రక కర్తవ్యాన్ని కూడా నెరవేరుస్తాయి.

ఈ వరుసలో అనేకమంది ప్రసిద్ధుల తొలినాటి కథలు ఈ సంకలనంలో చోటుచేసుకున్నాయి. కాళోజీనారాయణరావు 'మనమే నయం', దాశరథి రంగాచార్య 'తామరపూలు', వట్టికోట ఆళ్వారుస్వామి 'గాలిపటం' లాంటి కథలున్నాయి. ఇల్లెందుల సరస్వతి, సురవరం ప్రతాపరెడ్డి, చెరబండరాజు, నిఖిలేశ్వర్ లాంటి వారి కథలిందులో చేర్చారు. 1970ల నాటి దేవరాజు మహారాజు, నందిగం కృష్ణారావు, సదానంద్ శారద, కాలువ మల్లయ్య, తుమ్మేటి రఘోత్తమరెడ్డి, జ్వాలాముఖి, బి.యస్. రాములు కథలతోపాటు కొత్తతరం కథకులు జాజుల గౌరి 'మన్నుబువ్వ', అఫ్సర్ 'గోరియా', షాజహానా 'సిల్సిలా', పులిపాటి గురుస్వామి 'ఐటి కప్ప' లాంటి కథలు నేటి వ్యవస్థాగాయాల పచ్చదనాన్ని చూపిస్తాయి. ఇటీవలి కథకుల్లో ఓ నిండుతనం కనబడుతుంది. ప్రతీకాత్మకతలో పాఠకులగుండె బరువెక్కిస్తాయి. మొత్తంగా ఈ కథా సంకలనం ఓ భారమైన బాధ్యత. పుస్తకరించేటప్పుడు లోపాలూ సహజమే.... దాశరథి రంగాచార్య, వట్టికోట వంటి తెలంగాణా తలమానికమైనవారి కథల్లో ఇంకా మంచివాటికి స్థానమిస్తే బాగుండేదనే బాధ తప్ప ఈ సంకలనం అందరూ మెచ్చదగింది.

*

మనసా... తెలుసా?

ఏది ముఖ్యమో ఆలోచించండి

హిప్నో కమలాకర్

కౌన్సెలింగ్ సైకాలజిస్ట్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ ట్రైనర్,
ఫోన్: 9849130141

తల్లిదండ్రులందరూ పిల్లలకు, తమకు నడుమ దూరం ఏర్పడకుండా జాగ్రత్త పడాలి! ఇది ముఖ్యంగా కుటుంబ యజమానికి వర్తించే మాట. డబ్బు సంపాదనే ధ్యేయంగా కుటుంబ యజమాని కష్టపడతాడు. రోజంతా పలు ఇబ్బందులను, సవాళ్ళను ఎదుర్కొంటూ డబ్బు తెస్తాడు. అతనికి ఇల్లంటే ఒక విశ్రాంతి తీసుకునే మందిరం. ఇంటికొచ్చాక అతనికే సమస్యా దరికి రాకూడదు. రిలాక్సవ్వాలి. ఇంట్లో సభ్యులు అతనికి మానసికోల్లాసాన్ని కల్గించాలేతప్ప, ప్రశ్నల్తో విసిగించకూడదు. ఇది తండ్రుల తీరు. ఇక పిల్లలపెంపకం, ఆలనాపాలనా, మంచీచెడూ ఇవన్నీ చూసుకోవాల్సింది, తల్లిమాత్రమేనని తండ్రుల అభిప్రాయం. అందుకే టీనేజ్ పిల్లలు ఏదైనా తేడాగా ప్రవర్తించినట్లయితే, భార్యకేసి తిరిగి ఉరిమిచూస్తూ "ఇలా తగలడింది నీ పెంపకం" అంటారు. అక్కడికందులో తమ బాధ్యతేమీ లేనట్లు. ఆంగ్లంలో ఒక సామెతుంది... 'ప్రతివ్యక్తి ముందు మనిషిగా మారాలి. తర్వాత మంచి భర్తకావాలి. ఆ తర్వాత మంచి తండ్రి కావాలి. ఇక చివరిగా మాత్రమే మంచి ఉద్యోగస్తుడు కావాలి' అని. ఈ సామెత తండ్రి బాధ్యతలను బాగా గుర్తు చేస్తుంది.

మీరొక ఆఫీసులో గుమస్తా కావచ్చు, ఒక పెద్దపారిశ్రామికవేత్త కావచ్చు. ఒక టీచరు కావచ్చు. మీ ప్రొఫెషన్ ఏదైనా, అది తండ్రిగా మీ పాత్ర తర్వాతే అనే సత్యాన్ని గుర్తుంచుకోండి. అఫ్‌కోర్స్.. వృత్తి జీవితం మీ సొంతజీవితాన్ని డామినేట్ చేస్తుంది. పైగా రోజులెట్లా వున్నాయి? గట్టి పోటీ ఇస్తే కానీ పట్టుమని నాలుగు రాళ్ళు సంపాదించలేని మాట నిజమే. ఐనప్పటికీ మీ కుటుంబాన్ని మీరు అలక్ష్యం చేయకూడదు. మీరెవరికోసం కష్టపడుతున్నారు? భార్య, పిల్లలకోసమే కదా! వారితో మీ సంబంధాలు ప్రశ్నార్థకంగా తయారైనప్పుడు మీ వృత్తికి సార్ధకత ఎట్లా లభిస్తుంది? మీరెంత డబ్బు సంపాదించి మాత్రం ప్రయోజనం ఏమిటి? అందుచేత వ్యక్తిగా మీ జాగ్రత్తలు మీరు తీసుకుంటూ, తండ్రిగా మీ విధి నిర్వహణలను సక్రమంగా పాటించండి.

అన్యోన్య దాంపత్యం

పిల్లల పెంపకంలో భార్యను ప్రేమించడం చాలా ముఖ్యం. భార్యాభర్తలు వైవాహిక జీవితం కొనసాగిస్తూ పిల్లలపెంపకపు బాధ్యతను నిర్వర్తించే కుటుంబాల్లో, వారిరువురిమధ్య ఒద్దిక వుండడం చాలా అవసరం. ఇలా అయితే పిల్లల పెంపకం ఆరోగ్యకరమైన వాతావరణంలో సాగుతుంది. తల్లిదండ్రులు పరస్పరం కట్టుబడి వున్న వ్యక్తులుగా పిల్లలకు కన్పించాలి. తల్లిదండ్రులమధ్య, చీటికీమాటికీ ఘర్షణలు, గొడవలు అయ్యే కుటుంబాల్లో పిల్లలు మంచి మూర్తిమత్వాన్ని సంతరింపచేసుకోలేరు. బలమైన వైవాహిక బంధం, పిల్లలపెంపకం బాగుండటానికి పునాది అవుతుంది. వాళ్ళు ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరిగి లక్షణమైన భావాలను అలవర్చుకుంటారు. పాజిటివ్ భావాలను కలిగి ఇంటిపై అదరాభిమానాలను పెంచుకుంటారు.

గీతలు గీయకండి

పిల్లలు ఎదుగుతున్న క్రమంలో భిన్నభావాలను సంతరింప చేసుకోవటం ఏ తల్లిదండ్రులకైనా అయిష్టంగానే వుంటుంది. వాళ్ళు తమ వ్యక్తిత్వానికి ధీటైన మనస్తత్వాన్ని ఎందుకు ఏర్పరచుకోవడంలేదని చాలామంది అంటుంటారు. ఈ ప్రపంచంలో ఏ ఇద్దరు వ్యక్తులూ ఒకేలా వుండరు. ఈ మనస్తత్వశాస్త్ర సత్యం తండ్రీకొడుకులకూ వర్తిస్తుంది. మీ పెంపకంలో బిడ్డ ఒక అపూర్వమైన వ్యక్తిగా తయారవ్వాలే తప్ప మీకు గ్జిరాక్స్‌కాపీ కాకూడదు. మీరు కొన్ని విషయాల్లో చాలా గొప్ప కావచ్చు. అట్లాగే ఎదిగిన తర్వాత మీ బిడ్డ కూడా గొప్పవాడౌతాడు. అతనికి నచ్చినరంగంలో ముందడుగు వేయవచ్చు. మొత్తంమీద కొడుకు తనకు మించినవాడు కావాలని ప్రతి తండ్రీ మనసారా వాంఛిస్తాడు. తాను సాహిత్యరంగాన్ని గడగడలాడించిన పండితుడైతే తన కొడుకు తనకన్నా గొప్ప పండితుడు కావాలని ఆశిస్తాడు. అయితే ఆ పాండిత్యం, సాహిత్యంలోనే వుండాలనేం లేదు. మీ కొడుకు తనకి నచ్చినరంగంలో ముందుకు రావచ్చు. నా మిత్రుడి తండ్రిగారు ఒక బ్యాంకులో రీజనల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఆయనకు ఇప్పుడు జీతం పాతికవేల పైమాటే. ఆయన తన యౌవనపు రోజులను గుర్తుచేసుకుంటూ 'అప్పట్లో చాలా తక్కువ జీతానికి బ్యాంకులో వుద్యోగం దొరికింది. రెండో అబ్బాయి జి.ఆర్.ఇ రాసి అమెరికా వెళ్ళగా అతనికి ఉద్యోగంలో ప్రవేశించిన మొదటి నెలలోనే 36వేల సంపాదన. కానీ మా అబ్బాయి జీతాన్ని చేరుకోవడానికి నేనింకా చాలాదూరంలో వున్నాను. రిటైరయ్యేలోపునైనా అంత జీతం అవుతుందని నమ్మకం లేదు' అంటారు నవ్వుతూ. ఈవిధంగా పిల్లలు, తమ తల్లితండ్రులకే అమితాశ్చర్యాన్ని కల్గించే రీతిలో అభివృద్ధిని సాధించి చూపగల్గుతారు. ఈ నేపథ్యంలో వాళ్ళు తమలా వుండాలని, తమలా పెరగాలని తల్లితండ్రులు ఆలోచిస్తూ బాధపడడంలో అర్థం లేదు. పిల్లలు, జీవితపు సవాళ్ళను ఎదుర్కొనగల శక్తిమంతులుగా తీర్చిదిద్ది పంపగల్గితేచాలు.

చిన్నారుల అభిప్రాయాలను గౌరవించాలి

చాలామంది తల్లిదండ్రులు చేసే పొరపాటేమిటంటే తమ పిల్లల్ని తెగ నిందిస్తూ ఇతర పిల్లల్ని గౌరవిస్తూంటారు. వారితో పోల్చి తిడుతూంటారు. అవతలివారిలో ఏ చిన్న అంశమైనా వారికి ఎక్కువగానే కన్పిస్తుంది. తమ పిల్లలు ఆ పాటి చేయలేకపోయారని తెగ బాధ పడిపోతుంటారు. ఇతరుల విషయంలో వున్న సానుకూల వైఖరి తమ పిల్లలపై ప్రదర్శించడానికి వారికి మనసు రాదు. దాంతో పిల్లల్లో తల్లిదండ్రులకు తమపై సదభిప్రాయం లేదని, వారికి ఎంతసేపూ ఎదుటివారంటేనే ఇష్టం అనే భావన కలుగుతుంది. దీనివల్ల ఇద్దరిమధ్య మరింత దూరం పెరుగుతుంది. దూరం పెరిగినప్పుడు వారి మాటలను వినవల్సిన అవసరం కూడా కన్పించదు. అంచేత తల్లిదండ్రులందరూ పిల్లలకు, తమకు నడుమ ఇటువంటి దూరం ఏర్పడకుండా జాగ్రత్త పడాలి!

*

హైటెక్ కాలుష్యం

విజ్ఞాన వీచిక

ఎస్. వెంకట్రావు



హైటెక్ అనగానే మనకు ఆధునిక కంప్యూటర్లూ, గృహోపకరణాలూ గుర్తుకొస్తాయి. వినియోగ సంస్కృతే మానవ సంస్కృతిగా పరిగణించబడుతున్న ఈ కాలంలో అవసరాలూ, పర్యవసానాలతో నిమిత్తం లేకుండా హైటెక్ వస్తువినియోగం పెరిగిపోతోంది. అయితే వస్తువుల వాడకం వరకు బాగానే ఉంది గాని వాడి వదిలేసిన వ్యర్థపదార్థాలవల్ల మానవాళికి పెద్ద ముప్పు ముంచుకొస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇటీవలనే ఫ్రాన్స్ తన నౌకాదళంలో వాడి వదిలేసిన ఒక యుద్ధ నౌకను భారత దేశానికి 'షిప్ బ్రేకింగ్' కోసం పంపితే ఇక్కడ పెద్ద వివాదం నడిచింది. వాడి వదిలేసిన యుద్ధనౌకల్లో పెద్ద ఎత్తున విష పదార్థాలు ఉంటాయి గనుక వాటిని అభివృద్ధి చెందిన దేశాలు తమ భూభాగాల్లో విడగొట్టడానికి ఇష్టపడవు. భారత్, బంగ్లాదేశ్ లాంటి వర్ధమాన దేశాలకు పంపి అక్కడ విడగొడతాయి. దానివల్ల ఆయా దేశాల్లోని ప్రజలకూ, ముఖ్యంగా కార్మికులకూ, పర్యావరణానికీ ప్రమాదం వచ్చినా అవి పట్టించుకోవు. క్లెమెంసీ అనే ఫ్రెంచ్ యుద్ధనౌకను 'షిప్ బ్రేకింగ్' కోసం భారత్‌కు తరలిస్తున్నప్పుడు పెద్ద వివాదం జరగడం చివరకు ఫ్రెంచ్ ప్రభుత్వం యుద్ధనౌకను తిరిగి తమ దేశానికి రప్పించుకోవడం తెలిసిన విషయమే. ఇదంతా పైకి కనిపించిన చిన్న విషయం. కాని పైకి కనిపించకుండా ముంచుకొస్తున్న ముప్పు మరొకటి ఉంది. అదే ఇ-వ్యర్థం. అంటే ఎలక్ట్రానిక్ వ్యర్థం.

ఎలక్ట్రానిక్, ఎలక్ట్రిక్ పరికరాలనుండి వచ్చే వ్యర్థం (డబ్ల్యుఇఇ) ఒక్క భారతదేశంలోనే ఏడాదికి 1,46,180 టన్నులు ఉత్పత్తి అవుతోందని అంచనా. ఈ వ్యర్థాల్లో ప్రధానంగా కంప్యూటరు భాగాలున్నాయి. వీటితోబాటు ఇళ్లల్లో వాడుకునే ఎలక్ట్రానిక్ వస్తువులు, వాషింగ్ మెషిన్లు, సెల్ ఫోన్లు వంటివన్నీ ఈ కోవకే చెందుతాయి. ఒక్క బెంగుళూరు నగరంలోనే ప్రతి ఏటా 8,000 టన్నుల ఇ-వ్యర్థం ఉత్పత్తి అవుతోందని టాక్సిక్ లింక్ అనే స్వచ్ఛంద సంస్థ అంచనా వేసింది. ఇతర వస్తువులకన్నా ఎలక్ట్రానిక్ వస్తువులనుండి వ్యర్థాలు ఎక్కువగా ఉత్పత్తి అవుతాయి. కారణమేమిటంటే ఎలక్ట్రానిక్ పరికరాల్లో ప్రతిఏటా 30 శాతం పనికిరాకుండా పోతుంటాయి. మన దేశంలో సెకెండ్ హ్యాండ్ ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం ఎక్కువ కాబట్టి ఒక అంచనా ప్రకారం దేశంలో ప్రతి వారానికీ 2 శాతం ఎలక్ట్రానిక్ వస్తువుల తరుగుదల ఉంటుంది. అంటే సగటున యాభై వారాలకల్లా (సుమారు ఏడాదికే) ఎలక్ట్రానిక్ వస్తువు పనికిరానిదిగా తయారవుతుంది.

ఇ-వ్యర్థంలో ముఖ్యంగా కంప్యూటర్ మానిటర్లూ, టెలివిజన్ సెట్లూ ఇతర పరికరాల్లోని పదార్థాలు సహజంగా కుళ్లిపోవు. రీసైకిల్ చేయడం కూడా కష్టం. ఇటువంటి ప్లాస్టిక్‌తోబాటు ఇ-వ్యర్థంలో బంగారం, ప్లాటినమ్, అల్యూమినియమ్, కాడ్మియమ్, మెర్క్యురీ, సీసం, రాగి వంటి విలువైన లోహాలు కూడా ఉంటాయి.

ఇ-వ్యర్థాన్ని బహిరంగ ప్రదేశాల్లో దహనం చేయడం, యాసిడ్స్‌తో కడగడం చేస్తారు. కొన్నిసార్లు ఈ వ్యర్థాలను కాలువల్లోకీ, నదుల్లోకీ వదిలేస్తారు. వీటినుండి వెలువడే సీసం మెర్క్యురీ, కాడ్మియం, బ్రోమినేటెడ్ ఫ్లేమ్ రిటార్డెంట్స్ వల్ల మనుషుల ఆరోగ్యానికి తీవ్రమైన హాని జరుగుతుంది. ఈ వస్తువులను కాల్చి, యాసిడ్‌తో కడిగే పనిలో ఉన్న కార్మికుల ఆరోగ్యాలు కూడా బాగా దెబ్బతింటాయి. ఢిల్లీ చెత్త యార్డుల్లో ప్రతి ఏటా 10 నుండి 20 వేల టన్నుల ఇ-వ్యర్థాన్ని సుమారు 25,000 కార్మికులు శుద్ధి చేస్తుంటారు. ఈ వ్యర్థాల్లో నాలుగోవంతు కంప్యూటర్లే ఉంటాయి.

ఇ-వ్యర్థం వల్ల మనదేశానికి ప్రమాదం వస్తోందంటే అదంతా మనదేశంలో ఉత్పత్తి అయినదే అనుకుంటే పొరపాటు. నిజానికి మన దేశంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాల కన్నా అమెరికా, యూరప్ దేశాల నుండి మనదేశానికి దిగుమతి అవుతున్న వ్యర్థాలవల్లనే మనకు ప్రమాదం ఎక్కువగా ఉంది. మానవులకూ, పర్యావరణానికీ హానికలిగించే వ్యర్థపదార్థాలను వర్ధమాన దేశాలకు ఎగుమతి చేయకూడదని 1980లో కుదిరిన బేసల్ ఒప్పందం నిర్దేశిస్తోంది. 1994లో ఈ ఒప్పందంపై అభివృద్ధి చెందిన దేశాలన్నీ సంతకాలు చేశాయి. కాని అమెరికా మాత్రం ఇప్పటివరకు సంతకం చేయలేదు. ఎందుకంటే అమెరికా తన దేశంనుండి ఎలక్ట్రానిక్ వ్యర్థాలను భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్ వంటి వర్ధమాన దేశాలకు ఎగుమతి చేసి చేతులు దులుపుకుంటోంది. ఆ దేశంలో ఉత్పత్తి అయ్యే ఇ-వ్యర్థంలో 80 శాతం ఈ దేశాలకు ఎగుమతి చేస్తోంది. మనదేశంలో ఢిల్లీతోబాటు మీరట్, ఫిరోజాబాద్, చెన్నయ్, బెంగుళూర్, ముంబయిల్లో ఎలక్ట్రానిక్ స్క్రాప్ యార్డులున్నాయి. ఇక్కడ కార్మికులు ప్రమాదకరమైన పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. వ్యర్థాలను కాల్చడంవల్ల అనేకరకాల విషవాయువులు గాలిలో కలుస్తుంటాయి.

అమెరికా తన దేశం నుండి సెకెండ్ హ్యాండ్ ఎలక్ట్రానిక్ వస్తువులను కూడా మన దేశానికి పెద్ద ఎత్తున ఎగుమతి చేస్తోంది. నిజానికి ఇవన్నీ ఇ-వ్యర్థం కిందకే వస్తాయి. అమెరికాలో పనికిరాని ఒక కంప్యూటర్‌ను రి-సైకిల్ చేయాలన్నా, లేక నాశనం చేయాలన్నా 10 నుండి 30 డాలర్లు ఖర్చవుతుంది. వేలూ, లక్షల సంఖ్యలో ఉన్న కంప్యూటర్లకు ఎంత ఖర్చవుతుందో అర్థం చేసుకోవచ్చు. ఈ ఖర్చును తగ్గించుకోడానికి అమెరికా కంపెనీలు పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులను మన వంటి వర్ధమాన దేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. అంటే వర్ధమాన దేశాలను అవి తమ చెత్త కుప్పలుగా పరిగణిస్తున్నాయన్నమాట. అమెరికా కంపెనీల ఈ దురహంకార పూరిత ధోరణిపట్ల ఇప్పుడిప్పుడే మనదేశంలో కూడా చైతన్యం పెరుగుతోంది. చాలా స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాలు దీనిపట్ల నిరసన తెలుపుతున్నాయి. అమెరికా, యూరప్‌ల్లో కూడా తమ దేశ కంపెనీల, ప్రభుత్వాల దుర్మార్గంపట్ల ప్రజల్లో వ్యతిరేకత క్రమంగా పెరుగుతోంది. క్లెమెంసీకి వ్యతిరేకంగా జరిగినట్లే ఇ-వ్యర్థానికి వ్యతిరేకంగా కూడా దేశంలో ఉద్యమం రావాలి.

ఈ సందర్భంగా హైదరాబాద్‌ను ఐటి కేంద్రంగా మారుస్తామని చెప్పుకుంటున్న నేతలు దానివల్ల వచ్చే ఇ-వ్యర్థాన్ని ఏం చేయదలచుకున్నారో కూడా ముందుగానే చెప్పాలి. *

అనిశెట్టిపై పరిశోధనా గ్రంథం



ప్రముఖ అభ్యుదయ కవి అనిశెట్టి బహుముఖ ప్రజ్ఞాశాలి. అగ్నివీణ, బిచ్చగాళ్ల పదాలు, కావ్యాలు, గాలిమేడలు, మా ఊరు నాటకాలు, అనిశెట్టి కథలు, మరెన్నో వ్యాసాలు, మూకాభినయాలు, అనువాదాలు చేశారు. సినీ రచయితగా ఎన్నో పాటలు, డబ్బింగ్ చిత్రాలకు పని చేశారు. తనదంటూ ఒక ముద్రను సాధించగలిగారు. 'సంతానం'లో లతా మంగేష్కర్ పాడిన పాట 'నిదురపోరా తమ్ముడా', 'రక్త సంబంధం'లోని 'చందురుని మించు' పాటలు ఆయన్ని చిరంజీవిని చేశాయి. కవిగానే కాదు, ఉద్యమకారుడిగా అనిశెట్టి గొప్పతనాన్నీ, ఆయన బహుముఖ ప్రజ్ఞనూ విశ్లేషించిన పరిశోధనా గ్రంథమే డా॥ పి.వి. సుబ్బారావు గారి 'అనిశెట్టి సాహిత్యానుశీలనం'. అనిశెట్టి రచనలన్నీ కరుణరసాత్మకాలే. సామ్యవాద ధోరణిలో, సమసమాజ స్థాపనాలక్ష్యంతో రచనలు చేసిన అభ్యుదయ కవి ఆయన. అందుకే ఆయన రచనల నిండా అభ్యుదయ దృక్పథం కనిపిస్తుందని నిరూపించాడు పరిశోధకుడు. తదనంతర కథలలో అనిశెట్టి ప్రభావాన్ని తెలియజేసిన విధానం బాగుంది. ఇంతవరకు చెదురుమదురు వ్యాసాలు తప్ప, పూర్తి స్థాయిలో విశ్లేషణా గ్రంథం అనిశెట్టి రాయలేదు. ఆ కొరతను ఈ పరిశోధనా గ్రంథం తీర్చగలిగింది.

- కె.పి అశోక్ కుమార్

(అనిశెట్టి సాహిత్యానుశీలనం
డా॥ పి.వి. సుబ్బారావు, వెల 150/-, పేజీలు 262,
ప్రతులకు : న్యూ స్టూడెంట్స్ బుక్ డిపో, విశాలాంధ్ర బుక్ హౌస్)

గుండెదరువు
రావినూతల ప్రేమకిషోర్
వెల : 25/-.
పేజీలు : 41
ప్రతులకు :
ప్రజాశక్తి బుక్ హౌస్,
విశాలాంధ్ర బుక్‌హౌస్‌లలో

కొత్త శిశువు
మినీ కవితా సంపుటి
గుడిమెట్ల గోపాలకృష్ణ
వెల : 30/-, పేజీలు : 76
ప్రతులకు : శ్రీమతి జి. విజయశ్రీ
లుంబినీవనం, అరసవిల్లి,
శ్రీకాకుళం- 534 201

ఒక వీరుడి గాథ

జానపదగాయకులు పాడుకునే బల్మూరి కొండలరాయుడి వీరగాథకు, నవలారూపమే ఈ బహద్దూర్ కొండలరాయుడు. బల్మూరి మాధవరావుగారి సంస్థానంలో పనిచేసే రఘుపతిరావును అల్లుడిగా చేసుకోవడం ఆయన కుమారులకు ఇష్టం ఉండదు. తండ్రి చనిపోయిన తర్వాత ప్రయోజకుడైన రఘుపతిరావును హత్యచేసి చెల్లెలు ధర్మాంబ కుటుంబాన్ని వీధులపాలు చేస్తారు. రఘుపతిరావు కొడుకులైన కొండలరాయుడు వీరుడై, తన తండ్రి హత్యకు ప్రతీకారం తీర్చుకుంటారు. రాజ్యవిస్తరణకై సైన్యాలను కూడబెట్టుకొని కోటలు నిర్మించి గోల్కొండ ప్రభువులకు పక్కలో బల్లెంలా నిలుస్తారు. చివరకు శత్రుసేనలకు పట్టుబడటం ఇష్టంలేక ఆత్మార్పణం చేసుకుంటారు.

సర్వాయి పాపన్న సమకాలికుడిగా చిత్రించిన ఈ కొండలరాయుడి చరిత్ర వివాదాస్పదమైనదే. వీరిద్దరూ వీరులా, దోపిడీ దొంగలా అన్నది కచ్చితంగా నిర్ధారించలేం. రాజ్యస్థాపన, ప్రజాసంక్షేమం పట్టించుకోకుండా కేవలం ఖజానాలను కొల్లగొట్టిన వీరిని చారిత్రక పురుషులుగా, వీరులుగా అభివర్ణిస్తూ, వీరగాథలు పాడుకోవడంలో జనరంజకత ఉంటుందే గానీ నిజం ఉండదు. మొదటిసారిగా ఈ వీరుడి కథను నవలారూపంలో, అందునా వెండితెరకు అనువుగా చిత్రీకరించడాన ఇది చారిత్రక నవలగా రూపొందలేదు, కేవలం వీరగాథకు వచనారూపంగా తయారయింది.



- కె.పి

(బహద్దూర్ కొండలరాయుడు,
సి. శ్రీనివాసరాజు, వెల: 125/-, పేజీలు: 166,
ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో)

మ్యాంగో ఐస్‌క్రీం

కావలసిన పదార్థాలు

మామిడిపళ్ళ గుజ్జు	: రెండు కప్పులు
పాలు	: రెండు కప్పులు
పంచదార	: ఒక కప్పు
క్రీం	: ఒక కప్పు
ఎసెన్స్	: అర స్పూను
నిమ్మరసం	: ఒక స్పూను

తయారుచేసే పద్ధతి

పాలు బాగా మరిగించి చిక్కబడిన తరువాత మామిడిపండు గుజ్జులో పోసి పంచదార, క్రీమ్‌లు వేసి బాగా కలపాలి. దానిలో నిమ్మరసం, ఎసెన్స్ వేసి, ఐస్ ట్రేలో పోయాలి. ఈ మిశ్రమాన్ని నాలుగు గంటలపాటు ఫ్రీజర్‌లో ఉంచి ఆ తర్వాత బయటకు తీయాలి. ఒకసారి మిక్సీలో వేసి మళ్ళీ ఫ్రీజర్‌లో ఉంచాలి. గట్టిపడిన తరువాత బయటికి తీసి ఐస్‌క్రీం బౌల్స్‌లో పెట్టి సర్వ్‌చేయాలి. ఈ సీజన్లో మామిడిపండ్లు బాగా దొరుకుతాయిగనుక ఈ ఐస్‌క్రీం చేసుకుని పిల్లలూ, పెద్దలూ ఇష్టంగా తినొచ్చు.

వెజిటబుల్ ఛాట్

కావలసిన పదార్థాలు

దోసకాయ ముక్కలు	: ఒక కప్పు
టొమేటో ముక్కలు	: ఒక కప్పు
ఉల్లిపాయ ముక్కలు	: అర కప్పు
క్యారెట్ ముక్కలు	: ఒక కప్పు
బీట్‌రూట్ ముక్కలు	: ఒక కప్పు
కొత్తిమీర(తరుగు)	: అర కప్పు
మిరియాలపొడి	: పావు స్పూను
ఉప్పు	: అర స్పూను
కారం	: అర స్పూను
నిమ్మరసం	: ఒక స్పూను

తయారుచేసే పద్ధతి

ముందుగా పైనచెప్పిన కూరగాయ లన్నింటినీ శుభ్రంగా కడిగి తుడవాలి. తొక్క తీసేసి చిన్న చిన్న ముక్కలుగా తరుగుకోవాలి. అన్నింటినీ ఒక బౌల్‌లో వేసి పైన మిరయాలపొడి, ఉప్పు, కారం, నిమ్మరసం వేసి బాగా కలపాలి. పైన కొత్తిమీర వేసుకుంటే చాలు వెజిటబుల్ ఛాట్ సిద్ధం. ఇలా అయితే పచ్చి కూరగాయలు ఎన్నోరకాలు తినవచ్చు. ఆరోగ్యానికి మంచిది. ఎండాకాలంలో చలవ కూడా.

- పి.జ్యోతి

కరణం తెలివి

పెండెం జగదీశ్వర్

ఒక ఊళ్లో భీముడు అనే తలారి ఉండేవాడు. అతను అప్పుడప్పుడు పూనకం వచ్చినట్లు ఊగిపోయేవాడు. "ఒరేయ్! నేను ఆంజనేయ స్వామినిరా. నా కోరికలు తీర్చండిరా" అనేవాడు. అది చూసిన జనం నిజంగానే భీముణ్ణి ఆంజనేయస్వామి పూనాడని నమ్మేవారు. అతను కోరిందల్లా ఇచ్చేవారు. కాదంటే ఆంజనేయస్వామికి కోపం వస్తుందేమోనని భయపడేవారు. భీముడు వాళ్లతో కల్లు, సారాయి తెప్పించుకొని తాగేవాడు. అలా కొన్నాళ్లు జనాన్ని మోసం చేశాడు.

ఆ ఊరి కరణం చాలా తెలివైనవాడు. తలారి చేస్తున్న మోసాన్ని గ్రహించాడు. తలారికి తగిన బుద్ధి చెప్పి ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ఆపాలనుకున్నాడు. అందుకు తగిన సమయం కోసం ఎదురుచూడసాగాడు.

శ్రీరామనవమి పండుగ వచ్చింది. ఆ రోజు భీముడు మామూలుగానే పూనకం వచ్చినట్లు ఊగిపోతూ, అరుస్తూ వీధుల వెంట తిరగసాగాడు. అలా కరణంగారి ఇంటి ముందుకు వచ్చాడు. అదును కోసం చూస్తున్న కరణం నుదుటి మీద పంగనామాలు పెట్టుకున్నాడు. ఒక చేతిలో శంఖం, మరో చేతిలో చక్రం పట్టుకున్నాడు.

పూనకంతో ఊగిపోతున్నట్లు నటిస్తూ, భీముడు ముందుకు వెళ్లాడు. "ఒరేయ్! నన్ను గుర్తు పట్టవేమిరా? నేనురా... శ్రీరామచంద్రుణ్ణి" అన్నాడు గట్టిగా.

అనుకోని సంఘటనకు భీముడు విస్తుపోయాడు. వాడి పూనకం అంతా ఎగిరిపోయింది. కరణానికి సాష్టాంగ నమస్కారం చేశాడు.

"క్షమించండి స్వామీ! చాలాకాలమైంది కదా. అందుకే గుర్తించలేకపోయాను. నేనేం చేయాలో సెలవియ్యండి" అన్నాడు చేతులు జోడించి. కరణానికి పొలం దగ్గర పని ఉంది. అందుకని, "ఆంజనేయా! నన్ను నీ భుజాల మీదకు ఎత్తుకొని మా పొలం తీసుకెళ్లు" అన్నాడు.

తలారి కిక్కురుమనకుండా కరణాన్ని భుజం మీద ఎక్కించుకొని పొలం వైపు బయల్దేరాడు. కరణం స్థూలకాయుడు. అతణ్ణి మోయడం భీముడికి కష్టంగా ఉంది. కాసేపటికే భుజాలు నొప్పి పుట్టసాగాయి. నడకలో వేగం తగ్గింది.

"అప్పడే అలసిపోయావేంటి ఆంజనేయా! ఎంతోమంది రాక్షసులను మట్టి కరిపించిన నీ బలం, ఏడు సముద్రాలు అవలీలగా దాటిన నీ శక్తి ఏమయ్యాయి? త్వరగా నడువు" అంటూ శంఖంతో భీముడి నెత్తి మీద పొడవసాగాడు కరణం.

భీముడికి ముచ్చెమటలు పోశాయి. దెబ్బలతో తల వాచిపోతోంది. కాళ్లు పీకుతున్నాయి. అడుగు తీసి అడుగు వేయలేకపోతున్నాడు. చివరకు ఓ చోట కరణాన్ని కిందకు దించాడు.

అతని కాళ్ల మీద పడి, "నాకు బుద్ధి వచ్చింది. ఇంకెప్పుడూ జనాన్ని మోసం చేయను. నన్ను క్షమించండి" అని వేడుకున్నాడు భీముడు.

తన పథకం ఫలించినందుకు కరణం సంతోషించాడు. ఇంకోసారి అలా చేస్తే పోలీసులకు పట్టిస్తానని భీముణ్ణి హెచ్చరించాడు. భీముడికి చావు తప్పి కన్ను లొట్టపోయినట్లయ్యింది. ఇంకెప్పుడూ మోసానికి పాల్పడలేదు.